# సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**
సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర పదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో అసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.
**ఐడి కార్డు ఉచితం**
యం.సునీల్ కుమార్
సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్
సెల్ : 08512 254632



ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 250 బుధవారం 02 - 09 - 2026 పేజిలు : 08 వెల రూ. 2 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad





## రెండు రోజుల్లో 'తల్లికి వందనం' నిధుల విడుదల

- ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆర్థిక సాయం
- సాంకేతిక కారణాలతో ఆలస్యమైనట్లు వెల్లడి
- గతంలో అందని అర్హులకు కూడా ఈసారి జమ
- సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర - మిగతా 2 లో

# బటన్ నొక్కడానికి రాలేదు పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం
- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి
- రెండేళ్లలో పింఛన్లకే రూ.73,500 కోట్లు, సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు
- ఆడబిడ్డలకు త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం
- నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తన ఆశయమని స్పష్టీకరణ



**అమరావతి :**
"గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ - మిగతా 2 లో

## రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు




- రాష్ట్ర ఎన్నికల సంఘం
- రాష్ట్రంలో మొత్తం 13,278 గ్రామపంచాయతీలన్న ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా
- పోలింగ్ స్టేషన్ల అంశంలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నామని వ్యాఖ్య

**అమరావతి :**
రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు. మరోవైపు సమగ్ర ఓటర్ల నమోదు ప్రత్యేక జాబితా (సర్) ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కీలక పోలింగ్ - మిగతా 2 లో

## బంగారం కొనొద్దు స్వదేశీ వస్తువులే వాడండి



- దేశ ప్రజలకు మోదీ పిలుపు
- భారత్ జీడీపీలో 7.8 శాతం వృద్ధి
- స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న మోదీ
- విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ వద్దని పిలుపు
- అవసరం లేకపోతే బంగారం కొనొద్దని సూచన

**ఢిల్లీ :**
దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులు, సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరం లేని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దని చెప్పారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.- మిగతా 2 లో

## 100 ఏళ్ల చరిత్ర ఉన్న హిందూ దేవాలయం పాకిస్థాన్‌లో కూల్చివేత

- పాకిస్థాన్‌లో వందేళ్ల నాటి హిందూ దేవాలయం కూల్చివేత
- మదర్సా విస్తరణ కోసమే ఈ చర్య అని మైనారిటీ సంఘం ఆరోపణ
- అధికారుల ఆదేశాలున్నా అమలు కాలేదని విమర్శలు
- ఆలయాన్ని పునర్నిర్మించాలని స్థానికులు,హక్కుల సంఘం డిమాండ్



**ఢిల్లీ :**
పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శతాబ్ద కాలం నాటి చరిత్ర కలిగిన ఒక హిందూ దేవాలయాన్ని కూల్చివేసిన - మిగతా 2 లో

### పాక్ ప్రధాని ముందే ఉగ్రవాదంపై
## మోదీ కీలక వ్యాఖ్యలు..!

- ఎస్‌సీఓ వేదికగా ఉగ్రవాదంపై మోదీ ప్రసంగం
- ఉగ్రవాదానికి డబుల్ స్టాండర్డ్స్ ఉండకూడదని స్పష్టీకరణ
- టెర్రరిజాన్ని విధానంగా వాడే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని పిలుపు
- ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆయుధం కారాదని స్పష్టీకరణ
- పాక్ ప్రధాని షరీఫ్ సమక్షంలోనే మోదీ ఘాటు వ్యాఖ్యలు - మిగతా 2 లో

## భూమి నుంచి నేరుగా అంతరిక్షానికి లిఫ్ట్!

- త్వరలో నిజం కానుందా?
- స్పేస్ ఎలివేటర్ నిర్మాణంపై పరిశోధకుల పురోగతి
- 66 వేల మైళ్ల పొడవైన కేబుల్ ప్రతిపాదన
- కేబుల్‌కు పాలీక్రిస్టలైన్ గ్రాఫీన్‌ను పరిశీలిస్తున్న సైంటిస్ట్‌లు
- దక్షిణ కొరియాలో 1,000 మీటర్ల గ్రాఫీన్ తయారీ
- ప్రధాన సవాలుగా మారనున్న అంతరిక్ష వ్యర్థాలు

**ఢిల్లీ :**
అంతరిక్షంలోకి వెళ్లాలంటే ఇప్పటివరకు రాకెట్లే ప్రధాన మార్గం. కానీ భవిష్యత్తులో రాకెట్ల అవసరం లేకుండానే భూమి నుంచి నేరుగా అంతరిక్షానికి చేరుకునే అవకాశం ఉందా? శాస్త్రవేత్తలు ఈ ఆలోచనకు మరింత దగ్గరవుతున్నట్లు చెబుతున్నారు. దాదాపు 66 వేల మైళ్ల పొడవైన 'స్పేస్ ఎలివేటర్' నిర్మాణానికి - మిగతా 2 లో





## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

- కొండా సురేఖపై అంశంపై చర్చ!
- తాజా రాజకీయ పరిణామాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశంపై చర్చిస్తున్నట్లు సమాచారం
- మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించే అవకాశం

**హైదరాబాద్ :**
ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరుగుతోంది. - మిగతా 2 లో

## కల్వకుంట్ల కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్



- కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి
- కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా

**హైదరాబాద్ :**
కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని - మిగతా 2 లో

# తెలంగాణ హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు

- ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!
- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు



**హైదరాబాద్ :**
హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి.వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం - మిగతా 2 లో

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు



**సూర్య ఉదయం ప్రతినిధి :పెద్దకడబూరు :** అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త పింఛన్లను పంపిణీ చేస్తామని టీడీపీ మండల నాయకులు విజయకుమార్, ఏసేపు, భాష అన్నారు . అర్హులైన వారికి పింఛన్లను పంపిణీ చేశారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో ఇవ్వని పింఛన్లను ఏపీలో ఇస్తున్నారని స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నారని అన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, అర్హులైన ప్రతి ఒక్కరి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్సాకు,పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు

## డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి విజయవంతం చేయండి.వైసీపీ నేత

**కౌతాళం సెప్టెంబర్2 (సూర్యఉదయం):–** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం10:30 గంటలకు కౌతాళంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించబడుతుంది.ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు దేశాయ్ ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.కావున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు ప్రతి ఒక్కరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.



## ఎమ్మిగనూరులో కలెక్టర్ ఎ. సిరి విస్తృత పర్యటన





**సూర్య ఉదయం ఎమ్మిగనూరు :** ఎమ్మిగనూరు పట్టణంలో పర్యటనలో భాగంగా పట్టణంలో పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, సిబ్బంది పనితీరు మరియు మౌలిక సదుపాయాలపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా కలెక్టర్ ఎస్.ఎం.టి కాలనీ స్వర్ణ వార్డు కార్యాలయంని సందర్శించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పనితీరును ఫంక్షనరీల విభాగాల వారీగా ఆమె క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారితో ఎంతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కఠినంగా ఆదేశించారు.అనంతరం పట్టణంలోని బల్క్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులను పరిశీలించారు. పట్టణ పరిధిలోని డంప్ యార్డ్ మరియు ఎస్.టి.పి ఎస్ డి పి కేంద్రాలను సందర్శించి, వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా జరగాలని అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.అలాగే, సామాన్యులకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. అక్కడి వసతులు మరియు ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.కలెక్టర్ ఈ పర్యటనలో ఆమెతో పాటు ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎన్. గంగిరెడ్డి ఎం.ఆర్.ఓ తహసీల్దార్ శ్రీ కె. శ్రీనివాసులు ఎంపీ.డి.ఓ. బంగారమ్మ మరియు ఇతర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 18 రోజుల గీత యజ్ఞము కార్యక్రమం భక్తులు విజయవంతం చేయాలి



**ఏం ఊరుకుందప్ప సూర్య ఉదయం ఎమ్మిగనూరు :** ఎమ్మిగనూరు పట్టణంలో గీతా మందిరము స్వస్తిశ్రీ పరభానామ శ్రావణమాసం సందర్భంగా శ్రీ శ్రీ అవ్యకానంద సరస్వతి స్వాములు లోక కళ్యాణార్థానముకై 2 తేదీ నుండి19 వరకు గీత యజ్ఞము జరుగను. . గీతా మందిరం కార్యదర్శి ఏం ఊరుకుందప్ప మాట్లాడుతూ గీతా యజ్ఞము ఉదయం గంట 7-30 నుండి 10-30 వరకుగీతాప్రసంగములు : సాయంత్రం 6-30 నుండి రాత్రి 8 గంటల వరకుఉంటాయి.

**గీతా యజ్ఞమునకు సంబంధించిన వివరాలు :** రాసు. 1000 ఈ యజ్ఞమునకు కర్తదర్శి కీ చెల్లించవలసి ఉంటుంది. సెల్: 8121231599 9885592288, 9948640485 భోజనమునకు సామీప్యదశనమునకు సవరణము కలదు.4 వ తేదీ శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఉదయం 10. గంటలకు అలాగే ఉట్ట కొట్టే కార్యక్రమం శ్రీకృష్ణ ఉత్సాహ విగ్రహం వ్రతంపై అలంకరించి బాజా భజంత్రీలు కోలాటంలతో ఘనంగా ఊరేగింపు కార్యక్రమం అన్నదాన కార్యక్రమం.కలదు. కార్యక్రమంలో భక్తులు విజయవంతం చేయాలని తెలిపారు.

## ఉరుకుంద ఈరన్నస్వామివారి హుండీకి రూ.1.41 కోట్ల ఆదాయం



**కౌతాళం సెప్టెంబరు2(సూర్యఉదయం):–** శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామివారి హుండీ లెక్కింపులో భారీగా కానుకలు సమకూరాయి. ఆరు రోజుల హుండీ లెక్కింపులో మొత్తం రూ. 1,41,05,560/- నగదు ఆదాయం నమోదైనట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.నగదుతో పాటు 8 అమెరికా డాలర్లు,16 గ్రాముల 980 మిల్లీగ్రాముల బంగారం,25 కిలోల 300 గ్రాముల వెండి లభించినట్లు వెల్లడించారు.దేవస్థానం డిప్యూటీ కమిషనర్ కె. వాణి ఆధ్వర్యంలో,పాలకమండలి సభ్యుల సహకారంతో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి శ్రీ కె. కమలాకర్,1వ గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కర్నూల్, దేవస్థాన పర్యవేక్షకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఇండియన్ బ్యాంక్, ఆదోని సిబ్బంది, అలాగే శ్రీ భ్రమరాంభ సేవాసమితి ఆదోని సభ్యులు పాల్గొన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి విజయవంతం చేయండి

### వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి



సూర్య ఉదయం ప్రతినిధి :పెద్దకడబూరు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం10:30 గంటలకు పెద్దకడబూరూలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించ బడుతుంది.ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.కావున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు ప్రతి ఒక్కరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.

# జనసేనాని పుట్టినరోజు వేడుకలను జయప్రదం చేయండి

### భారీ బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరం, ఎల్ఈడీ స్క్రీన్‌పై పవన్ కళ్యాణ్ సందేశం

### యువజన విభాగం ప్రకటన, కార్యాచరణ వెల్లడి: ఎమ్మిగనూరు ఇంచార్జ్ రేఖగౌడ్

**సూర్య ఉదయం ప్రతినిధి, (సెప్టెంబర్ 01)(ఎమ్మిగనూరు):–** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలను బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇంచార్జ్ రేఖగౌడ్ తెలిపారు. ఎమ్మిగనూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ అధ్యక్షుల పిలుపు మేరకు ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాలలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకలకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




**ప్రధాన కార్యక్రమాలు:–**భారీ బైక్ ర్యాలీ: ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా జనసైనికులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.యువజన విభాగం ప్రకటన ఉ సభ: బైక్ ర్యాలీ అనంతరం కుర్ని కళ్యాణ మండపంలో నిర్వహించే సమావేశంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా జనసేనాని సందేశాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం కమిటీని ఏర్పాటు చేసి, వారి విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారు.

**రక్తదాన శిబిరం:** స్థానిక 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిత్యం రోగులు, గర్భిణీలతో రద్దీగా ఉండే దృష్ట్యా, వారి అత్యవసర అవసరాల కోసం జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మూడు మండలాల పరిధిలోని కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గౌరవం, ప్రాధాన్యత లభిస్తాయని రేఖగౌడ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు గానుగ బాషా, ఖాసిం సాహెబ్, ఉత్తేజ్, అనిల్ మరియు వీరమహిళ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాల్లో యూ-టర్న్‌ల పరిశీలన

### ట్రాఫిక్ సాఫీకి చర్యలు







**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్‌ను మరింత సాఫీగా, సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాల్లోని యూ-టర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాట్లను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజా రవాణాకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు యూ-టర్న్‌లు, జంక్షన్లు, ట్రాఫిక్ కదలికలను మరింత సమర్థవంతంగా నిర్వహించి వాహనదారుల ఆలస్యాన్ని తగ్గించే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పరిశీలనలో భాగంగా ట్రాఫిక్ కలిసే ప్రాంతాలు, ట్రాఫిక్ ఘర్షణకు అవకాశం ఉన్న ప్రాంతాలు, యూ-టర్న్‌ల వద్ద ఏర్పడుతున్న వాహనాల క్యూలు, మలుపుల వ్యాసార్థం, రహదారి నిర్మాణం, పీక్ అవర్స్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ, పరస్పరం అడ్డుకునే ట్రాఫిక్ కదలికలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుత యూ-టర్న్ ఏర్పాట్లను మరింత మెరుగుపరిచే అవకాశాలను అధ్యయనం చేసి, ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేయడంతో పాటు ఆలస్యాలను తగ్గించి రద్దీని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**జేఎన్‌టీయూ నుంచి రాయదుర్గం మెట్రో వరకు రహదారి పరిశీలన**

అనంతరం జేఎన్‌టీయూ నుంచి సింక్రనీ (రాయదుర్గం) మెట్రో స్టేషన్ వరకు ఉన్న ప్రధాన రహదారిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రహదారి మార్గం కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతుంది. జేఎన్‌టీయూ నుంచి సింక్రనీ (రాయదుర్గం) మెట్రో స్టేషన్ వైపు ప్రయాణించే ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేక క్యారేజ్‌వే ఏర్పాటు చేసే అవకాశాలను ఈ సందర్భంగా పరిశీలించారు. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ఐటీ ఉద్యోగులు సురక్షితంగా, సాఫీగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రతిపాదన ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ నేతృత్వంలో జరిగిన ఈ పరిశీలనలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్, ట్రాఫిక్-1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంక్రాంతి రవి కుమార్, ట్రాఫిక్-1 అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు వారాంతపు పనిదినాల్లో ఈ మార్గంలో భారీగా వాహనాల రాకపోకలు సాగుతుండటంతో ట్రాఫిక్ నిర్వహణపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రతిపాదిత ప్రత్యేక క్యారేజ్‌వే ద్వారా ఐటీ ఉద్యోగులకు మరింత సురక్షితమైన, సాఫీ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఈ ప్రధాన కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, మొత్తం ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మెరుగైన యూ-టర్న్‌లు -- సాఫీ ట్రాఫిక్ -- సురక్షిత రహదారులే లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల చర్యలు కొనసాగుతున్నాయి.

# మైనారిటీ మహిళలకు రూ.50 వేల ఆర్థిక చేయూత

### ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద కూకట్‌పల్లి నియోజకవర్గ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన అర్హులైన మహిళలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తదితరులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మైనారిటీ మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ పథకం ద్వారా మహిళలకు స్వతంత్రంగా ఆదాయం పొందే అవకాశాలు మెరుగుపడటంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు.




**బండి రమేష్ ప్రత్యేక చొరవ**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించడంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అర్హులైన మహిళలను గుర్తించడం, పథకం వివరాలను వారికి తెలియజేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేయడంలో బండి రమేష్ కృషి చేశారని పేర్కొన్నారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచి, వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రూ.50 వేల ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, పథకం ద్వారా ప్రయోజనం అందేలా కృషి చేసిన బండి రమేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, వాజిద్ భాష, అస్లాం తదితరులు పాల్గొన్నారు.



# జీవో 97ను రద్దు చేయాలి- పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్

### విద్యార్థుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తా: ఎమ్మెల్సీ కోదండరాం

**సూర్య ఉదయం ప్రతినిధి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరాం హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీలో తనకు లభించిన అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోనని స్పష్టం చేశారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, బిఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ పాలిటెక్నిక్ వ్యవస్థలో విద్యతో పాటు నైపుణ్యం కూడా అంతర్భాగంగా ఉందన్నారు. జీవో 97పై విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




**శక్తి స్కీంను వెనక్కి తీసుకోవాలి:** ఆర్. కృష్ణయ్య పాలిటెక్నిక్ విద్యార్థుల విషయంలో పట్టింపులకు పోతే కాంగ్రెస్ ప్రభుత్వానికే పరువు పోతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. నైపుణ్యం లేని వారికి స్కిల్ శిక్షణ అందించాల్సి ఉంటుందని, అయితే డిప్లొమా విద్యార్థులకు ఇప్పటికే సాంకేతిక నైపుణ్యం ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో క్యాంపస్ ఉద్యోగాలు పొందుతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. జీవో 97 విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గితే ప్రభుత్వానికే మంచి పేరు వస్తుందని చెప్పారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై పూర్తి స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.కార్మిక శాఖలోకి మార్చడం సరికాదు: వినోద్ కుమార్ విద్యాశాఖ పరిధిలోని సాదీజును కార్మిక శాఖలోకి విలీనం చేయడం సరికాదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. తాము స్కిల్ యూనివర్సిటీకి వ్యతిరేకం కాదని, అయితే నైపుణ్యాభివృద్ధికి, సాంకేతిక విద్యకు మధ్య ఉన్న తేడాను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. చరిత్ర, మంచి ట్రాక్ రికార్డు కలిగిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను బలహీనపరిచే విధంగా జీవో 97ను తీసుకొచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఇకనైనా పునరాలోచించి శక్తి స్కీంను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

**పాలిటెక్నిక్ భూములపై అనుమానాలు :** పాలిటెక్నిక్ కళాశాలల భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే జీవో 97ను తీసుకొచ్చారా అనే అనుమానాలు ఉన్నాయని ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మందాల భాస్కర్, దీ=ాం నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ అంశాలను సమగ్రంగా పరిశీలించి జీవో 97 రద్దుకు సహకరించాలని వారు ఎమ్మెల్సీ కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ కన్వీనర్ గోపు జనార్ధన్, కో-ఆర్డినేటర్ ఆజాద్, కో-కన్వీనర్ సుధీర్, సెక్రటరీ జనరల్ శ్రవణ్ గౌడ్, శ్రీరామ్, ఖాఖీ రాష్ట్ర అధ్యక్షుడు వివేక్ పటేల్, ౹ాణాఖ కన్వీనర్ స్వాతి, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఖాఖీ× మధు, ౹ాఖీ× అశోక్ రెడ్డి, జీచీఖన ౹ాఖీ రాహుల్ నాయక్, ౹ా×ఖూా వైశాలి తదితర విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు. అలాగే జీచీ౹ూ, మసాబ్ ట్యాంక్, ౹ా కాలేజ్, పఠాన్‌చెరు, సికింద్రాబాద్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రణీత, విశాల్, అభిరామ్, ఇర్ఫాన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలు, ఆరు గ్యారంటీలపై ప్రజాక్షేత్రంలో పోరాటం

### - సెప్టెంబర్ 2 నుంచి డివిజన్ స్థాయి ప్రజా సమావేశాలు

### - బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా

**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, బూటకపు ఆరు గ్యారంటీలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని కొనసాగిస్తున్నట్లు బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి డివిజన్ స్థాయిలో ప్రజా సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశాలకు కూకట్‌పల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఆయా డివిజన్లలో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ల వారీగా సమావేశాల షెడ్యూల్‌ను ఆయన వెల్లడించారు. సెప్టెంబర్ 2న బోయినపల్లి డివిజన్‌లో, 4న బాలానగర్ డివిజన్‌లో, 5న బేగంపేట డివిజన్‌లో, 6న ఫతేనగర్ డివిజన్‌లో, 7న మూసాపేట్ డివిజన్‌లో, 8న అల్లాపూర్ డివిజన్‌లో, 9న బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్లను కలిపి, 10న కూకట్‌పల్లి డివిజన్‌లో ప్రజా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



**ఇంటింటికీ బాకీ కార్డులు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, గ్యారంటీల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజన్ స్థాయిలో విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రెడ్డి సతీష్ అరోరా తెలిపారు. ప్రజల మద్దతును కూడగట్టి భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ ‘బాకీ కార్డులు’ ఇంటింటికీ చేరేలా కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలను చైతన్యపరచాలని ఆయన కోరారు. డివిజన్ స్థాయి సమావేశాలను విజయవంతం చేసి, కాంగ్రెస్ హామీలపై ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక

బుధవారం 02 - 09 - 2026

# జేఎన్‌టీయూహెచ్‌లో ఐకేఎస్‌పై వారం రోజుల స్వల్పకాలిక కోర్సు ప్రారంభం



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జీమీఖు)లోని యూజీసీ--మాళవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఖ+జ--వీమీజ) ఆధ్వర్యంలో “సంపూర్ణ విద్య కోసం భారతీయ జ్ఞాన వ్యవస్థలను (×ఖూ) ఏకీకృతం చేయడం” అనే అంశంపై యూజీసీ ప్రాయోజిత వారం రోజుల స్వల్పకాలిక కోర్సు మంగళవారం ప్రారంభమైంది. సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు ఆఫ్‌లైన్ విధానంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఇందులో మొత్తం 55 మంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డా. ఎ. జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డైరెక్టర్ డా. ఎం. సుషమ, సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్-- డా. వి. కామాక్షి ప్రసాద్, మేఘా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (వీ×జుజె), హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్, వైస్ ప్రిన్సిపాల్ డా. బి. సాయి వెంకట కృష్ణతో పాటు పలువురు ప్రముఖ నిపుణులు, అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. సమకాలీన విద్యా విధానంలో భారతీయ జ్ఞాన వ్యవస్థలను అర్థవంతంగా అనుసంధానం చేయడం, వాటిపై అవగాహన పెంపొందించడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. సంపూర్ణ విద్య, అంతర్విషయక అభ్యసనం, నూతన ఆవిష్కరణలు, సాంస్కృతిక చైతన్యం, విలువల ఆధారిత విద్యను బలోపేతం చేయడంపై కోర్సులో ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. కోర్సులో భారతీయ జ్ఞాన వ్యవస్థలు, ఇంజనీరింగ్--ఆవిష్కరణల్లో ఐకేఎస్ పాత్ర, వేదాలు--ఉపనిషత్తులు, సంస్కృతం--సహజ భాషా ప్రక్రియ (చీూ), రసాయన శాస్త్రం--గణిత శాస్త్రానికి సంబంధించిన ప్రాచీన భారతీయ సాహిత్యం, యోగా, ఆయుర్వేదం, భారతీయ సౌందర్యశాస్త్రం, లలిత కళలు, దేవాలయ వాస్తుశిల్పం, సంగీతం, నాట్యకళ, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద కళలు, అర్థశాస్త్రం, నీతిశాస్త్రం తదితర అంశాలను చేర్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డా. ఎ. జయలక్ష్మి మాట్లాడుతూ, భారతదేశపు గొప్ప మేధో, సాంస్కృతిక వారసత్వాన్ని సమకాలీన విద్య, విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధ్యాపకులు తమ బోధన, పరిశోధన, విద్యా విధానాల్లో భారతీయ జ్ఞాన వ్యవస్థలను సమర్థవంతంగా ఏకీకృతం చేసేందుకు తగిన మార్గాలను అన్వేషించాలని ఆమె సూచించారు. -వీమీజ డైరెక్టర్ డా. ఎం. సుషమ స్వాగతోపన్యాసం చేస్తూ, సంపూర్ణ, విలువల ఆధారిత, అంతర్విషయక విద్యను ప్రోత్సహించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ముఖ్య అతిథి, వనరుల వ్యక్తులు, అధ్యాపకులు, పాల్గొనేవారికి ఆమె స్వాగతం పలికారు. కోర్సు సమన్వయకర్తలు డా. వి. కామాక్షి ప్రసాద్, డా. బి. సాయి వెంకట కృష్ణ మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విద్యాపరంగా సుసంపన్నంగా తీర్చిదిద్దడంతో పాటు పాల్గొనే అధ్యాపకులందరికీ ప్రయోజనకరంగా ఉండేలా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకు వివిధ విశ్వవిద్యాలయాలు, సంస్థలు, సంఘాలకు చెందిన నిపుణులతో పాటు యూజీసీ ప్యానెల్‌లోని ఐకేఎస్ మాస్టర్ ట్రైనర్లను వనరుల వ్యక్తులుగా ఎంపిక చేశారు. వీరు తమ విభిన్న నైపుణ్యాలు, అనుభవాలు, దృక్కోణాలను పాల్గొనే అధ్యాపకులతో పంచుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్య, పరిశోధన రంగాల్లో భారతీయ జ్ఞాన వ్యవస్థల సమకాలీన ప్రాధాన్యతపై అధ్యాపకులకు అవగాహన కల్పించడంతో పాటు పరస్పర చర్చలు, ఆలోచనల మార్పిడికి అవకాశం లభించనుంది.

# గత పాలకుల తప్పులకు చెక్- భూ ప్రక్షాళనకు కాంగ్రెస్ శ్రీకారం

- ధరణి అక్రమాలకు ముగింపు.. భూభారతితో పారదర్శకత
- హైడ్రాతో ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ భూములకు విముక్తి
- వసంతనగర్ 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం: గాదె శివ చౌదరి



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న భూ వ్యవహారాలను ప్రక్షాళన చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు, వసంతనగర్ డివిజన్ నేత గాదె శివ చౌదరి అన్నారు. ఫారెస్ట్, అసైన్డ్, ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా మార్చి ధరణి రికార్డుల్లో చేర్చడంతో పాటు, కొందరు రైతుబంధు ప్రయోజనాలను కూడా అక్రమంగా పొందారని ఆయన ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, రైతు రుణమాఫీ వంటి హామీల విషయంలో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ‘ప్రజల భూమి--ప్రజల హక్కు’ అనే సిద్ధాంతంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని గాదె శివ పేర్కొన్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములు ఆక్రమణలకు గురైన సందర్భాల్లో వాటిని హైడ్రా ద్వారా తిరిగి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ధరణి రికార్డుల్లో ఉన్న లోపాలను సరిదిద్ది, భూభారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**నారాయణపురం రైతుల కల సాకారం**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అనడానికి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతుల సమస్య పరిష్కారమే నిదర్శనమని గాదె శివ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017లో చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా నారాయణపురం గ్రామంలోని భూములను ఫారెస్ట్ జాబితాలో చేర్చడంతో రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యను పరిష్కరించి, 780 మంది రైతులకు 1,337 ఎకరాలకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క అందజేశారని గుర్తుచేశారు. భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టా పుస్తకాలను అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

**వసంతనగర్ భూముల సమస్యకు పరిష్కారం**

వసంతనగర్ భూముల విషయంలోనూ ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గాదె శివ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ భూములకు సంబంధించి సమస్యలు తలెత్తాయని, వాటిని 22-ఏ జాబితాలో చేర్చిన ఘనత గత పాలకులదేనని విమర్శించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వసంతనగర్ భూముల సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని శివ అన్నారు. “హామీ అంటే కాంగ్రెస్.. అమలు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం” అని పేర్కొన్నారు. అక్రమాలు, అన్యాయాలకు ముగింపు పలికి నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని గాదె శివ స్పష్టం చేశారు. వసంతనగర్ ప్రజలంతా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బండి రమేష్ వెంట నడవాలని ఆయన పిలుపునిచ్చారు.

# తూతూమంత్రంగా కూల్చివేతలు- నిర్మాణం మాత్రం యథాతథం!

**బాలాజీ నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం**

**2 ఫ్లోర్లకు అనుమతి తీసుకుని జీ౫ పాటు పెంట్‌హౌస్ నిర్మాణం**

**ప్లాట్ నంబర్ 39లోని ఈ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందంటున్న స్థానికులు**

**అధికారులకు సవాల్ విసురుతున్న నిర్మాణదారుడు..**

**‘ఏమీ చేయలేరు’ అన్న ధీమాతో ముందుకు?**





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి సర్కిల్-52 పరిధిలోని బాలాజీ నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు అంతస్తులకు మాత్రమే అనుమతులు తీసుకున్నప్పటికీ, ప్రస్తుతం జీ5తో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నారని వారు పేర్కొంటున్నారు. అధికారులకు పలుమార్లు చర్యలు తీసుకోవాలని తెలిపిన తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, నిర్మాణం మాత్రం యథాతథంగా కొనసాగుతుండటంపై కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**తూతూమంత్రంగా కూల్చివేతలు... నిర్మాణం యథాతథం**

బాలాజీ నగర్ డివిజన్‌లోని హెచ్.నెం. 15-21-150/104, ప్లాట్ నంబర్ 39లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు తూతూమంత్రంగా, కూల్చివేత చర్యలు చేపట్టినట్లు కనిపించినా.. కొంత భాగం తొలగించిన భవన నిర్మాణదారుడు ఇంతేనా... ఏమి చేయలేరు అన్న ధీమాతో మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారులు చేపడుతున్న చర్యలు కేవలం తూతూమంత్రంగా మారుతున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేయాల్సిన అధికారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**2 ఫ్లోర్లకు అనుమతి... జీ౫తో పాటు పెంట్‌హౌస్!**

రెండు ఫ్లోర్ల నిర్మాణానికి అనుమతి తీసుకుని, దానికి మించి జీ5తో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణంలో అనుమతించిన పరిమితులను మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ ప్రాంతంలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, భారీ నిర్మాణ పనుల కారణంగా చుట్టుపక్కల నివాసితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ప్లాట్ నంబర్ 39 నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందా?**

ప్లాట్ నంబర్ 39లో జరుగుతున్న నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందనే అనుమానాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు భూమి స్వరూపం, ఎఫ్‌టీఎల్ పరిమితులు, నిర్మాణానికి మంజూరైన అనుమతులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందా? లేదా? అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, అవసరమైతే సంబంధిత శాఖలతో సంయుక్తంగా సర్వే నిర్వహించి వాస్తవాలను తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులకు సవాల్ విసురుతున్న నిర్మాణదారుడు?**

అధికారులు నిర్మాణాన్ని నిలిపివేయాలని సూచించినా, నిర్మాణ పనులు మాత్రం ఆగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో నిర్మాణదారుడికి అధికారులపై ఎలాంటి భయం లేకపోయినట్టుగా కనిపిస్తోందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులు ఏమీ చేయలేరన్న ధీమాతోనే నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం మౌనం వహించడం పలు ప్రశ్నలకు తావిస్తోందని కాలనీ వాసులు అంటున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లినా నిర్మాణ పనులు కొనసాగుతుండటంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

అనుమతులకు మించి నిర్మించిన నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్లాట్ నంబర్ 39లో మంజూరైన బిల్డింగ్ పర్మిట్, అనుమతించిన అంతస్తులు, నిర్మించిన అంతస్తులు, ఎఫ్‌టీఎల్ పరిధి తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లు తేలితే అదనపు నిర్మాణాలను చట్టప్రకారం తొలగించి, భవిష్యత్తులో ఇలాంటి అక్రమ నిర్మాణాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేస్తారా? లేక కేవలం తూతూమంత్రపు చర్యలతో సరిపెడతారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# గాయత్రినగర్ వార్డులో ‘వన్ డే - వన్ వార్డు’ కార్యక్రమం

- స్థానిక సమస్యలపై కమిషనర్ క్షేత్రస్థాయి సమీక్ష
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు ఆదేశాలు



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** ‘వన్ డే - వన్ వార్డు’ కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి సర్కిల్‌లోని గాయత్రినగర్ వార్డులో మంగళవారం కమిషనర్ సృజన, సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో నేరుగా మాట్లాడి వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీనగర్, శ్రీ వివేకానందనగర్, తులసీనగర్, లక్ష్మీనగర్, జ్యోతినగర్, పద్మావతినగర్, జేపీ నగర్, మీరాజ్ నగర్, అజీజ్ నగర్ ఆర్‌డబ్ల్యూఏల ప్రతినిధులు పాల్గొని పలు పౌర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. పద్మావతినగర్ లో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ పనులు పూర్తయిన అనంతరం వి.డి.సి.సి. రోడ్డు పనులు చేపట్టాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, సున్నం చెరువు వద్ద పెండింగ్‌లో ఉన్న గోడ పనులను పూర్తి చేయడంతో పాటు చెరువు కట్ట వెంట రిటైనింగ్ వాల్ నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. అనంతరం జ్యోతినగర్ స్థానిక మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సీవరేజ్ లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కరీమ్ మార్బుల్ స్టోన్ షాప్ నుంచి అల్లాపూర్ కల్వర్ట్ వరకు మిగిలిన 150 మి.మీ. పక్కా నాలా పనులను పూర్తి చేయాలని కోరారు. అదేవిహంగా లక్ష్మీనగర్ కాలనీలో మురుగునీటి సామర్థ్యాన్ని పెంచి తరచూ ఏర్పడుతున్న ఓవర్‌ఫ్లో సమస్యను నివారించేందుకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ద్వారా 300 మి.మీ. వ్యాసం కలిగిన యూజీడీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. తులసీనగర్ సీ-బ్లాక్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయడంతో పాటు ప్రజల భద్రత దృష్ట్యా వైర్ల ఎత్తును పెంచాలని విజ్ఞప్తి చేశారు. జనప్రియనగర్ లో చెత్తను తొలగించడం, క్రమం తప్పకుండా రోడ్లను శుభ్రం చేయడం, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని కోరారు. శ్రీ వివేకానందనగర్ లో విద్యుత్ మీటర్ల కేటాయింపు, పనిచేయని వీధి దీపాల మరమ్మతులు చేపట్టాలని కోరారు. గాయత్రినగర్ లో ఇండోర్ స్టేడియం ఒక వైపున గోడ నిర్మించాలని, సెంట్రల్ పార్క్‌లోని మెట్లను తొలగించాలని, నార్త్ గాయత్రినగర్ నుంచి సౌత్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రోడ్ వరకు పశ్చిమ వైపున సుమారు 450 మీటర్ల మేర 30 అడుగుల రోడ్డు కనెక్టివిటీ కల్పించాలని ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు కోరారు. కైత్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహనాల రాకపోకలకు సంబంధించిన సమస్యలను కూడా ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు కమిషనర్ సృజన దృష్టికి తీసుకువచ్చారు. వీటితో పాటు యూజీడీ పైప్‌లైన్ల సామర్థ్యం పెంపు, తాగునీటి సరఫరా మెరుగుదల, విద్యుత్ మీటర్ల కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై కూడా విజ్ఞప్తులు అందాయి.

**ప్రాధాన్యతతో పరిష్కరించాలి**

స్థానికులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను కమిషనర్ సృజన స్వయంగా విని, వాటిపై అధికారులతో సమీక్షించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సంబంధిత సీబీఎంసీ అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పౌర పాలనను మరింత చేరువ చేయడం, వార్డు స్థాయి సమస్యలను నేరుగా స్థానికుల నుంచి తెలుసుకోవడం, వివిధ శాఖల సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కార చర్యలు చేపట్టడం ‘వన్ డే - వన్ వార్డు’ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది ఎండి. హుస్సేన్ నియామకం



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ మరియు సమన్వయ కమిటీ సభ్యుడిగా ప్రముఖ సీనియర్ ముస్లిం న్యాయవాది అడ్వకేట్ ఎండి. హుస్సేన్‌ను జిల్లా కలెక్టర్ నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములు, ఆస్తుల పరిరక్షణ, అక్రమ ఆక్రమణలను అడ్డుకోవడం, వక్ఫ్ సంస్థల హక్కులను కాపాడడం వంటి ముఖ్య ఉద్దేశ్యాలతో ఈ కమిటీ పనిచేయనుంది. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి అవసరమైన సమన్వయం, పర్యవేక్షణతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి కమిటీ ప్రత్యేకంగా కృషి చేయనుంది. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన జిల్లా కలెక్టర్‌కు అడ్వకేట్ ఎండి. హుస్సేన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు సమాజ సంక్షేమానికి కట్టుబడి, తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావంతో, నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు. అడ్వకేట్ ఎండి. హుస్సేన్ నియామకంపై పలువురు ప్రముఖులు, న్యాయవాదులు మరియు ముస్లిం సమాజ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# పింఛన్ కోసం లబ్ధిదారుల గడప వద్దకే టీడీపీ నేతలు



**కౌతాళం సెప్టెంబరు2(సూర్య ఉదయ):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా కౌతాళం టౌన్‌లో సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు,మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్ పాల్గొన్నారు.మంగళవారం భేటీగేరి మారెమ్మ గుడి, మాసులగేరి,ఎస్సీ కాలనీ, కెబ్బరి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు మాట్లాడుతూ.. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల గడప వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు.వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 చొప్పున పింఛన్ అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.పేదలు, వృద్ధులు,వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం కూటమి ప్రభుత్వ పాలనలో ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులురాజనంద్,టీడీపీ నాయకులు రాజబాబు, రమేష్,గొట్టయ్య,ఈరన్న, రేవన్న,యూనిట్ ఇన్‌చార్జ్ నబి తదితరులు పాల్గొన్నారు.

# కోటికి చేరువైన ‘ఇంటింటికీ తెలుగుదేశం--2026’

- 37వ రోజుకు చేరిన ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమం
- ఇప్పటివరకు 97 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణ
- కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన
- మంగళవారం ఒక్కరోజే లక్షన్నరకు పైగా ఇళ్ల సందర్శన




తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం’ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. మంగళవారం నాటికి ఈ కార్యక్రమం 37వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 97.32 లక్షల ఇళ్లను సందర్శించి, కోటి ఇళ్ల సందర్శన లక్ష్యానికి చేరువయ్యారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 1,52,172 ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడప తట్టి, కుటుంబ సభ్యులతో నేరుగా సంభాషిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను నమోదు చేసుకుంటున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఈ స్పందనతో మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.ం

# ఏపీ మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్... ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటన
- సంక్షేమంతో పాటు అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం
- మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ 350 కేసులు వేసిందని విమర్శ
- ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.73,000 కోట్లు అందించామని వెల్లడి



ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన ‘ఎన్టీఆర్ భరోసా’ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే ‘దీపం’ పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు.ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఇంజినీరింగ్ అద్భుతం ఎత్తైన కొండలు చీల్చుకుంటూ ముందుకు గోదారమ్మ పరుగులు

**ఎన్నో అద్భుతాలకు నిలయంగా**

**పోలవరం ఎడమ కాలువ నిర్మాణం**

**కనుచూపు మేర కాంక్రీట్ నిర్మాణంతో**

**కనువిందు చేస్తూ ప్రవాహం**



మధ్యలో భారీ అక్విడెక్ట్లు, వంతెనలను నిర్మించిన అధికారులు

కనువిందు చేస్తూ గలగలా సాగే నీటి ప్రవాహం కనుచూపు మేర కాంక్రీట్‌తో నిర్మాణం. అక్కడక్కడా నడుముకు వడ్డాణంలా కనిపించే భారీ అక్విడెక్ట్లు, వంతెనలు. ఎత్తైన కొండలను చీల్చుకుంటూ వెళ్లే గోదావరి. ఇదీ అద్భుతంగా సాగిన పోలవరం ఎడమ కాలువ నిర్మాణ తీరు. నిజంగా ఇదంతా ఓ ఇంజినీరింగ్ అద్భుతమేనని చెప్పాలి. ఆ కాలువ ద్వారానే గొంతెండిన గ్రామాల దప్పిక తీర్చుతూ బీడు వారిన భూములను బంగారంగా మార్చుతూ ఉత్తరాంధ్ర వైపు గోదారమ్మ పరుగులు తీస్తోంది. గోదావరి పురుషోత్తపట్నం గ్రామంలో ప్రారంభించిన ఆ పరుగు పిల్ల కాలువగా మారే వరకు దారి వెంట జరిగే అద్భుత దృశ్యాలను చూసొద్దాం పదండి. ఉత్తరాంధ్రాను ఆదుకున్న గోదావరి : ఎక్కడో మహారాష్ట్రలో పుట్టి ఎన్నో వేలమైళ్లు ప్రవహించి ఉద్ధృతమై, ఉగ్రరూపమై దిగువకు వచ్చిన గోదావరి పోలవరం ప్రాజెక్టు వద్దకు రాగానే కాస్త శాంతిస్తుంది. సమీపంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల వద్దకు వచ్చాక నడక మార్చుకుంటుంది. మోటార్ల ధాటికి వచ్చిన ఒత్తిడితో ఉవ్వెత్తున ఎగిసి పడుతూ దిశ మార్చుకుని గలగలా ప్రవహిస్తూ, పోలవరం ఎడమ కాలువలోకి చేరి దిగువకు పరుగులు పెడుతోంది. గొంతెండిన గ్రామాల దాహం తీర్చుతూ బీడు వారిని పొలాలను సస్యశ్యామలం చేస్తూ ముందుకు నడుస్తుంది. దారి పొడవునా రైతన్నను ఆశీర్వదిస్తూ కొండంత భరోసా ఇస్తూ కనువిందుగా ముందుకు కదులుతోంది. లిఫ్ట్ ఇరిగేషన్‌తో కాలువలేకి నీళ్ల పోలవరం ఎడమ కాలువను అద్భుతమైన నిర్మాణశైలితో నిర్మించారు. కాంక్రీట్ కవచంతో కాలువ గట్లను పటిష్టం చేసి చుక్క నీరు వృథా కాకుండా డిజైన్ చేశారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ద్వారా త్రీడీ హైడ్రాలిక్ నమూనాలతో హెడ్ రెగ్యులేటర్ కెపాసిటీని ముందే లెక్కించారు. కాలువ అలైన్‌మెంట్ కోసం అధునాతన జీఐఎస్ , డ్రోన్ సర్వేలను వాడారు. పురుషోత్తపట్నం, పుష్కర వంటి భారీ లిఫ్ట్ ఇరిగేషన్ పంపులతో నది నీటిని కాలువలోకి ఎక్కించే పంపింగ్ టెక్నాలజీని అమోఘం అని చెప్పాలి. చాలా చోట్ల నదులు అడ్డంగా రాగా నీటి ప్రవాహం కోసం నిర్మించిన భారీ అక్విడెక్ట్లను ప్రత్యేకతగా చెప్పుకోవాలి. కత్తిపూడి నుంచి తుని వెళ్లే మార్గంలో నాలుగు భారీ అక్విడెక్ట్ల నిర్మాణం ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. అనేక సవాళ్లను ఎదుర్కొన్న గోదారమ్మ కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ నిర్మాణ మార్గంలో భాగంగా కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ వద్ద 123 మీటర్లు, 115 మీటర్ల ఎత్తున్న రెండు భారీకొండలను తొలిచి కాలువ తవ్వడం ఇంజినీరింగ్ అద్భుతమని చెప్పాలి. సుదీర్ఘ ప్రయాణంలో వందలాది చిన్న, పెద్ద వాగులు, నదులు, రోడ్లు, రైల్వే లైన్లను దాటడానికి అనేక అక్విడెక్టులు, అండర్ టన్నెల్స్ నిర్మించారు. పురుషోత్తపట్నం నుంచి పోలవరం ఎడమ కాలువలో కలిసిన గోదావరమ్మ సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని గ్రామాల మీదుగా ముందుకు వడివడిగా కదులుతుంది. మురారి వద్ద కాకినాడ జిల్లాలో ప్రవేశిస్తుంది. 23 టీఎంసీ నీటిని తరలించడమే లక్ష్యంగా ఈ భారీ కాలువను నిర్మించారు. దారిలో పలు జాతీయ రహదారులు, నదులు, కాలువలు, రైల్వే ట్రాక్ లు , ప్రవాహాలు అడ్డురాగా పలు భారీ వంతెనలను నిర్మించారు. విశాఖ వాసుల దాహార్తిని తీర్చుతున్న గోదావరి : కాకినాడ జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో బీడువారిన పలు నియోజకవర్గాల మీదుగా ప్రవహించే పోలవరం ఎడమ కాలువ ఏకంగా లక్షా 67 వేల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేస్తోంది. గండేపల్లి మీదుగా ముందుకు సాగుతూ జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని, కాకినాడ రూరల్ నియోజకవర్గాల మీదుగా ప్రహిస్తోంది. శంఖవరం, గొల్లప్రోలు, ఏలేశ్వరం మీదుగా ముందుకు కదులుతోంది. మధ్య మధ్యలో తూముల ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేశారు. రామవరం, తాళ్లూరులో భారీ ఎత్తిపోతల లిఫ్ట్ స్కీంలు నిర్మించి నీటిని పంపింగ్ చేస్తూ వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేయనుంది. గోదావరి జలాలను విశాఖ వైపు నడిపించే ఈ కాలువ, ఎండిన భూములకు ప్రాణం పోసే ఒక అమృతధారగా కనిపిస్తోంది. ప్రగతికి సాక్ష్యంగా నిలుస్తూ విశాఖ వాసుల దాహార్తిని తీర్చేందుకు ఉత్తరాంధ్ర వైపు అడుగులు వేస్తూ నవశకాన్ని నిర్మిస్తోంది.

# హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి హైవే విస్తరణలో ముందడుగు

**క్లియరెన్స్ ఇచ్చిన పీపీపీఏసీ**

**ఇక కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ**

**ఆమోదమే తరువాయి**

**మూడు ప్యాకేజీలుగా 284 కి.మీ. విస్తరణ**

**అంచనా వ్యయం రూ.12 వేల కోట్లు**

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి (చీ౦-65)ని ఆరు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు కీలకమైన ఆమోదం లభించింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సమర్పించిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన తర్వాత ఈ ప్రాజెక్టుకు అధికారికంగా అనుమతి లభిస్తుంది. ఈ ఆమోదం సెప్టెంబర్‌లో లభించే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఏఐ వర్గాలు పేర్కొంటున్నాయి.

**284 కి.మీ దూరం, మూడు ప్యాకేజీలు :**

హైదరాబాద్ శివార్లలోని మల్కాపూర్ నుంచి విజయవాడలోని గొల్లపూడి బైపాస్ వరకు ఉన్న 226 కి.మీ మార్గాన్ని నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ పనులు రెండు ప్యాకేజీలలో జరుగుతాయి: ఒకటి హైదరాబాద్ నుంచి నందిగామ వరకు, మరొకటి నందిగామ నుంచి గొల్లపూడి వద్ద ఉన్న విజయవాడ బైపాస్ వరకు. ఈ విస్తరణ పనులు 'బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్' విధానంలో చేపట్టారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు రహదారి విస్తరణలో భాగంగా, కనూరు సిద్ధార్థ కళాశాల నుంచి దావులూరు టోల్ ప్లాజా దాటి అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ను కలిసే ప్రాంతం వరకు ఉన్న 14 కి.మీ మార్గంలో, ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్ క్రాసింగ్ పాయింట్ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న 44 కి.మీ మార్గాన్ని ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ ప్రాజెక్టు 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' కింద ఒకే ప్యాకేజీగా అమలు చేస్తారు. రూ.12,000 కోట్ల ప్రాజెక్టుకు పీపీపీఏసీ ఆమోదం: హైదరాబాద్-విజయవాడ మధ్య 226 కి.మీ, విజయవాడ-మచిలీపట్నం మధ్య 58 కి.మీ కలిపి మొత్తం 284 కి.మీ విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి, ఆగస్టు 8న పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశం జరిగింది. గతంలో లేవనెత్తిన అభ్యంతరాలపై చీనాూ× అందించిన వివరణలను కమిటీ పరిశీలించి, ఆ తర్వాత ప్రాజెక్టుకు కొత్తగా ఆమోదం తెలిపింది. భూసేకరణ, నిర్మాణ వ్యయాలతో కలిపి అంచనా వేసిన రూ. 12,000 కోట్ల వ్యయానికి ఆమోదం లభించిందని సమాచారం. ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు 'ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ' కి సమర్పిస్తారు. భారీ ప్రాజెక్టులకు తుది ఆమోదం తెలిపే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. ఆమోదం లభించిన తర్వాత, భూసేకరణ, టెండర్ల ఆహ్వానం (ప్యాకేజీల వారీగా) ప్రక్రియలు ప్రారంభమవుతాయి. భవానీపురం దాటి విస్తరణ: మొదట్లో, హైదరాబాద్-విజయవాడ హైవేను అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో కలిసే కంచికచర్ల (198 కి.మీ దూరం) వరకు మాత్రమే విస్తరించాలనే ప్రతిపాదన ఉండేది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ రాస్తూ, విస్తరణను కంచికచర్ల వద్ద ఆపకుండా విజయవాడ బైపాస్‌తో కలిసే గొల్లపూడి వరకు పొడిగించాలని కోరారు. తత్ఫలితంగా విజయవాడ బైపాస్ వరకు 226 కి.మీ విస్తరణ కోసం 'వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక' రూపొందిస్తారు. గొల్లపూడి నుంచి భవానీపురం మీదుగా వెళ్లే హైవే విభాగం ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజాప్రతినిధులు దీని విస్తరణను కోరారు. దీనివల్ల, గొల్లపూడిలోని విజయవాడ బైపాస్ నుంచి భవానీపురంలోని కనకదుర్గ ఫ్లైఓవర్ వరకు ఉన్న 5 కి.మీ మార్గాన్ని ఆరు లేన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన వచ్చింది. దీనితో మొత్తం విస్తరణ 231 కి.మీకి చేరేది. అయితే చివరి 5 కి.మీ మార్గానికి పీపీపీఏసీ ఆమోదం తెలపలేదు. హైదరాబాద్ నుంచి విజయవాడ బైపాస్ (గొల్లపూడి) వరకు 226 కి.మీ విస్తరణకు మాత్రమే ఆమోదం లభించింది. ఎలివేటెడ్ బ్రిడ్జ్ ప్రతిపాదన విరమణ: విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు హైవే విస్తరణలో భాగంగా, బెంజ్ సర్కిల్ నుంచి ఇదుపుగల్లు జంక్షన్ వరకు ఎలివేటెడ్ ఆరు లేన్ల కారిడార్‌ను నిర్మించాలనే ప్రతిపాదన ఉండేది. కానీ పీపీపీఏసీ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపలేదు. కనూరు నుంచి దావులూరు టోల్ ప్లాజా దాటి ఔటర్ రింగ్ రోడ్‌ను దాటే పాయింట్ వరకు హైవే నాలుగు లేన్లుగానే కొనసాగుతుంది. అయితే ఇరువైపులా కొత్త సర్వీస్ రోడ్లు నిర్మించారు. ఓఆర్ఆర్ క్రాసింగ్ పాయింట్ నుంచి మచిలీపట్నం వరకు హైవేను ఆరు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు మాత్రమే పీపీపీఏసీ ఆమోదం తెలిపింది.



# ఆర్మీ కంచుకోట మద్రాస్ రెజిమెంట్‌లో చోరీ 12 ఆయుధాలను ఎత్తుకెళ్లిన దుండగులు

**4 ఏకే-47లు, ఆరు పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్,**

**మందుగుండు సామగ్రి మాయం**

**దుండగులు గది లోపలికి ఎలా వచ్చారనే ప్రశ్నలు**

**సిబ్బందే చోరీకి పాల్పడి ఉండొచ్చన్న అనుమానాలు**



హైదరాబాద్ కంటోన్మెంట్‌లోని అత్యంత కట్టుదిట్టమైన ఆర్మీ స్థావరంలో ఆయుధాల చోరీ కలకలం రేపుతోంది. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాలు భద్రపరిచే గది తాళం పగులగొట్టి 12 ఆయుధాలను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన అందరినీ షాక్‌కు గురి చేసింది. 4 ఏకే-47లు, 6 పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్‌తో పాటు మందుగుండు సామగ్రి చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. హైదరాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో డిఫెన్స్‌కు చెందిన 12 రకాల ఆయుధాలు చోరీకి గురైనట్లు ఆర్మీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంటోన్మెంట్‌లో ఆర్మీ శిక్షణ సంస్థతో పాటు వివిధ రెజిమెంట్లు కొనసాగుతున్నాయి. వాటిలో మద్రాస్ రెజిమెంట్ కూడా ఒకటి. ఈ రెజిమెంట్‌లో ఆర్మీ సిబ్బంది ఆయుధాలను భద్రపరిచే ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఉంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే దానిలోకి అనుమతి ఉన్న వ్యక్తులు మినహా ఇతరులు ఎవరూ ప్రవేశించేందుకు అవకాశం ఉండదు. రెజిమెంట్ చుట్టూ 4 గేట్లతో కట్టుదిట్టమైన జవాన్ల భద్రత ఉంటుంది. ఆర్మీ అధికారులు, జవాన్లు, అనుమతి ఉన్న వ్యక్తులు తప్ప లోపలికి ఎవర్నీ పంపడానికి అవకాశం లేదు. అయితే ఆదివారం రాత్రి ఆయుధాలు భద్రపరిచే గదిలో చోరీ జరిగినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు తుపాకులు భద్రపరిచే గది తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి 4 ఏకే-47 తుపాకులు, ఆరు పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్‌తో పాటు మందుగుండు సామగ్రిని తీసుకెళ్లినట్లు తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.15 లక్షల వరకు ఉంటుందని చెబుతున్నారు. సిబ్బందిలోనే దుండగులు మరోవైపు ఆయుధాల చోరీకి గురైన మద్రాస్ రెజిమెంట్ చుట్టూ అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న నేపథ్యంలో బయట వ్యక్తులు ఎలా లోపలికి వచ్చారని ఆర్మీ అధికారులు ప్రశ్నలు వేసుకుంటున్నారు. సిబ్బందిలోనే ఎవరైనా ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చున్న కోణంలోనూ వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రెజిమెంట్‌లోని సిబ్బందిని అంతర్గతంగా విచారణ చేస్తూ ఆయుధాల భద్రత, తాళాల నిర్వహణ, ఆ సమయంలో డ్యూటీలో ఉన్న సిబ్బంది వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గదిలో ఉన్న 12 ఆయుధాలను ఒక్క వ్యక్తి తీసుకెళ్లడం సాధ్యం కానే కాదు. ఈ దొంగతనంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పాల్గొని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అత్యంత భద్రత ఉండే ప్రాంతంలోని ఆయుధాలు భద్రపరిచే గది వరకు చేరుకున్న వ్యక్తులకు రెజిమెంట్‌లోని భద్రతా వ్యవస్థపై పూర్తి అవగాహన ఉండే అవకాశం ఉందన్న కోణంలోనూ కేసును పరిశీలిస్తున్నారు. సున్నిత అంశం - పోలీసుల గోప్యం మద్రాస్ రెజిమెంట్ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండటంతో ఆర్మీ అధికారులు సోమవారం ఉదయం అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రక్షణ వ్యవహారాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశం కావడంతో ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. ఘటన అనంతరం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీసు ఉన్నతాధికారులు మద్రాస్ రెజిమెంట్‌లోని ఘటనా స్థలిని పూర్తిగా పరిశీలించారు. సమీపంలోని సీసీ ఫుటేజీని తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, చోరీ జరిగిన సమయం, రెజిమెంట్‌లోకి వచ్చి, బయటకు వెళ్లిన వారి వివరాలపై ఆరా తీస్తున్నారు.

# 'క్యూర్'లో లాటరీ ప్రక్రియ ముగిసింది ఇల్లు దక్కింది ఎంతమందికో తెలుసా

**క్యూర్‌లో తొలివిడత ఎల్ఐజీ లాటరీ**

**ప్రక్రియ పూర్తి**

**డ్రా ద్వారా 7,340 మంది ఎంపిక**

**క్షేత్రస్థాయి విచారణ, పరిశీలన**

**అనంతరం ఫ్లాట్లు కేటాయింపు**

**పలు ప్రాంతాల్లో ఎల్లుండితో**

**ముగియనున్న గడువు**



హైదరాబాద్ క్యూర్ పరిధిలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తయింది. ఇందిరమ్మ టవర్లలో ఫ్లాట్ల కోసం డ్రా ద్వారా 7,340 మందిని ఎంపిక చేశారు. క్షేత్రస్థాయి విచారణ, ఆధారాల పరిశీలన తర్వాతే ఫ్లాట్లు కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు స్పష్టం చేసింది. ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, గోషామహల్ నియోజకవర్గాల్లో దరఖాస్తుల గడువు ఈ నెల 3న ముగియనుంది. అర్హులను గుర్తించి ఇళ్ల కేటాయింపు హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అల్పాదాయ వర్గాలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల ఫ్లాట్ల కేటాయింపులో కీలక ప్రక్రియ ముగిసింది. క్యూర్ పరిధిలో లాటరీ ద్వారా 7,340 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. తొలి విడతగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న 16 అసెంబ్లీ నియోజవర్గాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఖైరతాబాద్, నాంపల్లి, శేరిలింగంపల్లి, అంబర్‌పేట, బహదూర్‌పురా, ఇబ్రహీంపట్నం, కార్వాన్, మలక్‌పేట, మల్కాజిగిరి, మేడ్చల్, రాజేంద్రనగర్, సనత్‌నగర్, కంటోన్మెంట్, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి 60,720 దరఖాస్తులు వచ్చాయి. అందులో 40,900 మంది మాత్రమే అర్హులు ఉన్నట్లు పరిశీలనలో తేలింది. వీరిలో లాటరీ ద్వారా 7,340 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. వెబ్‌సైట్లో ఎంపికైన వారి వివరాలు లాటరీలో పేరు వచ్చినా సరే క్షేత్రస్థాయి విచారణ, ఆధారాల పరిశీలన తర్వాతే ఫ్లాట్లు కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వీసీ వీపీ గౌతమ్ వెల్లడించారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఎవరైనా అనర్హులు ఎంపికైనట్లు తెలిస్తే ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు తెలపవచ్చునని సూచించారు. అర్హులకు మాత్రమే ఇళ్లు దక్కాలన్న లక్ష్యంతో బహుళ స్థాయి తనిఖీ విధానం అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశారు. కొందరు తమ నివాస నియోజకవర్గానికి బదులుగా పొరపాటున వేరే నియోజకవర్గాన్ని ఎంపిక చేశారని, అలాంటి దర ఖాస్తు దారులు ఆ న్‌లైన్‌లో సరి చేసుకోవాలని తెలిపారు. లాటరీలో ఎంపిక కాని వారు నిరుత్సాహపడొద్దని, రాబోయే ప్రాజెక్టుల్లో మళ్లీ అవకాశం ఉంటుందని గౌతమ్ వెల్లడిం చారు ."ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే నాకు కొత్త రేషన్ కార్డు వచ్చింది. ఈరోజు ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రాలో కూడా నా పేరు రావడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" - ఇందిరమ్మ ఇంటికి ఎంపికైన మహిళ. మరో 5 నియోజకవర్గాల్లో నోటిఫికేషన్లకు కసరత్తులు ఇందిరమ్మ ఫ్లాట్ల లాటరీలో ఇళ్లు వచ్చిన లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమ సొంతింటి కల నెరవేరబోతోందని కొందరు భావోద్వేగానికి లోనయ్యారు. ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, గోషామహల్ నియోజకవర్గాల్లో దరఖాస్తు గడువు ఈ నెల 3తో ముగియనుంది. మరో 5 నియోజకవర్గాల్లో కూడా అనువైన స్థలాలను గుర్తించి, దశల వారీగా నోటిఫికేషన్లు జారీ చేసేందుకు హౌసింగ్ బోర్డు కసరత్తు చేస్తోంది. "గత ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఎన్నోసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేస్తున్నాను. కానీ ఎప్పుడూ మంజూరు కాలేదు. నాకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది" - ఇందిరమ్మ ఇంటికి ఎంపికైన మహిళ

## ప్రభుత్వ కార్యక్రమంలో కనిపించని మంత్రి కొండా సురేఖ ఫొటో, పేరు

**మంత్రివర్గం నుంచి కొండా సురేఖ తొలగింపు ప్రచారానికి బలం**

**కేసముద్రంలో ప్రభుత్వ కార్యక్రమంలో సురేఖ ఫొటో, పేరు తొలగింపు**

**ఫ్లెక్సీలో ప్రతిపక్ష నేతల ఫొటోలు.. సొంత మంత్రికి దక్కని చోటు**

**కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరు కాకపోవడంపై చర్చ**

**రాజకీయ వర్గాల్లో తీవ్రంగా మారిన ఊహాగానాలు**



రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు జరగనున్నాయని, మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తప్పిస్తారని వస్తున్న ఊహాగానాలకు బలం చేకూర్చేలా ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. సొంత ఉమ్మడి జిల్లా పరిధిలోనే జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఆమె ఫొటో, పేరు లేకపోవడం రాజకీయంగా కలకలం రేపింది. ఈ ఘటన కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే, మునిసిపాలిటీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. అయితే ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఫొటోలు ఉన్నాయి. ఆశ్చర్యకరంగా, బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఫొటోలను కూడా ముద్రించారు. కానీ, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ ఫొటోకు మాత్రం చోటు కల్పించలేదు. అంతేకాకుండా, శంకుస్థాపన శిలాఫలకంపై కూడా ఆమె పేరును చేర్చకపోవడం గమనార్హం. మరోవైపు, ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ గైర్హాజరు కావడం కూడా చర్చనీయాంశమైంది. తనను మంత్రివర్గం నుంచి తొలగిస్తారనే ప్రచారం జరుగుతున్న తరుణంలోనే, సొంత జిల్లాలో ప్రోటోకాల్ పాటించకపోవడం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్.. ఫ్యూచర్ సిటీకి ప్రపంచ స్థాయి వర్సిటీల క్యూ

**ఫలించిన తెలంగాణ ప్రభుత్వ యూకే, యూఎస్ పర్యటనలు**

**హైదరాబాద్‌లో నార్త్‌ఈస్టర్న్, లండన్ యూనివర్సిటీల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు**

**ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో హార్వర్డ్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కోర్సులు**

**త్వరలో హైదరాబాద్‌కు రానున్న విదేశీ నిపుణుల బృందాలు**




రాజధాని హైదరాబాద్‌ను భారతదేశంలోనే అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల యూకే, అమెరికా పర్యటనల్లో సాధించిన పురోగతిపై ఉన్నతస్థాయి కమిటీ సోమవారం సీఎంకు నివేదిక సమర్పించింది. ఈ పర్యటనల ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు కుదిరినట్లు కమిటీ వెల్లడించింది. అమెరికాకు చెందిన నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లండన్ భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయి. ముఖ్యంగా, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ తన క్యాంపస్‌ను 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రభుత్వ, కార్పొరేట్ అధికారుల కోసం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను ప్రారంభించేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ కూడా అంగీకరించింది. ఈ కోర్సులు వచ్చే నవంబర్ నుంచే ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆగస్టు 19 నుంచి 29 వరకు యూకే, యూఎస్‌లలో పర్యటించి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఎంఐటీ వంటి దిగ్గజ సంస్థలతో చర్చలు జరిపింది. ఈ చర్చల ఫలితంగా, ఆయా సంస్థల ప్రతినిధుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి. ఐటీ, ఫార్మా రంగాల్లో ఇప్పటికే ప్రత్యేక ముద్ర వేసిన హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, నైపుణ్య కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# భర్త బలవంతపు మతమార్పిడి.. కాకినాడ ఎస్పీ ఆఫీస్ వద్దే తిరిగి హిందూ మతంలోకి వచ్చిన భార్య

**భర్త తనను బలవంతంగా మతం మార్చి వేధించాడని మహిళ ఆరోపణ**

**ప్రేమ వివాహం తర్వాత వేధింపులు తీవ్రమయ్యాయని భార్య ఆవేదన**

**మరో ఐదారుగురు మహిళలనూ మతం మార్చాడని ఫిర్యాదు**

**భర్త గౌస్ మొహిద్దీన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



ప్రేమ పేరుతో తనను మోసం చేసి, బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చి, తన భర్త తీవ్ర వేధింపులకు గురిచేశాడని ఓ మహిళ కన్నీటిపర్యంతమై ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలోనే ఆమె తన తల్లితో బొట్టు పెట్టించుకుని, తిరిగి హిందూ మతంలోకి వస్తున్నట్లు ప్రకటించడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురానికి చెందిన సిరివూరి బాలరమ్య, డిగ్రీ చదువుతున్న రోజుల్లో మటన్ షాపు నడిపే గౌస్ మొహిద్దీన్‌తో ప్రేమలో పడింది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం తల్లిదండ్రులను ఎదిరించి ఆమె అతడిని వివాహం చేసుకుంది. అయితే, వివాహమైన రెండు నెలలకే వేధింపులు ప్రారంభమయ్యాయని, తనను బలవంతంగా ఇస్లాంలోకి మతమార్పిడి చేసి షేక్ ఉమల్ ఖైర్‌గా పేరు మార్చాడని ఆమె వాపోయింది. తమకు కుమార్తె జన్మించిన తర్వాత వేధింపులు మితిమీరాయని, తన సమక్షంలోనే మరో ఐదారుగురు హిందూ యువతులతో సహజీవనం చేస్తూ, వారిని కూడా మతం మార్చాడని ఆమె ఆరోపించారు. దీనిపై నిలదీస్తే.. తనకు ఏడుగురిని వివాహం చేసుకునే అధికారం ఉందని చెబుతూ, కత్తులతో బెదిరించి దాడి చేసేవాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన సోదరిని కూడా వేధిస్తానని అతడు బెదిరింపులకు పాల్పడినట్లు ఆమె పేర్కొన్నారు. గతంలో ఓ యువతిని కత్తితో గాయపరిచిన కేసులో గౌస్ మొహిద్దీన్‌పై రౌడీషీట్ నమోదైందని, ప్రస్తుతం ఒక ఎస్సీ మహిళను వేధించిన కేసులో అతడు రిమాండ్‌లో ఉన్నాడని బాలరమ్య తెలిపారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌తో కలిసి జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసిన ఆమె, తనకు రక్షణ కల్పించి భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి బలవంతపు మతమార్పిడులపై సమగ్ర విచారణ జరిపించాలని ఈ సందర్భంగా రామ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# ‘పింక్ సాల్ట్’ ఆరోగ్యానికి మంచిదేనా

## నిపుణులు ఏమంటున్నారంటే!

## మీరు ఉప్పు వాడకం తగ్గించాలని అనుకుంటున్నారా

## ఈ పింక్ సాల్ట్ వాడితే అనేక ఆరోగ్య ప్రయోజనాలట!



‘ఉప్పు ఎంత తగ్గిస్తే అంత మంచిది, ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి’ అని డాక్టర్లు, పోషక నిపుణులు పదే పదే చెబుతుంటారు. అందుకే, సాల్ట్ తగ్గించుకుని తినడంతో పాటు, తక్కువ హాని కలిగించే వాటిని వెతికి మరీ కొంటున్నారు చాలా మంది. ఇందులో భాగంగా ఈ మధ్య మార్కెట్లో ఎక్కువగా కనిపిస్తున్నదే ‘ హిమాలయన్ పింక్ సాల్ట్’. ఈ ఉప్పును వాడడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పింక్ సాల్ట్ వల్ల కలిగే హెల్త్ బెనిఫిట్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

హిమాలయన్ పింక్ సాల్ట్‌ను మార్కెట్‌లో రాక్‌సాల్ట్‌గా, పింక్ సాల్ట్‌గా, లైట్ సాల్ట్‌గా లేదా తక్కువ సోడియం సాల్ట్‌గా అమ్ముతుంటారు. ఇది ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేదంలోనూ, సాధారణంగానూ భావిస్తుంటారు. అయితే నార్మల్ ఉప్పుతో పోలిస్తే రాక్ సాల్ట్ అనేది తక్కువ ప్రాసెస్ చేస్తారని నిపుణులు పేర్కొన్నారు. ఇందులో ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయని, ఇవి శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి ప్రేగులను శుభ్రపరచడంతో పాటు గట్ హెల్త్‌ను మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**ఖనిజాలు అధికంగా ఉండటం :** పింక్ సాల్ట్‌లో శరీరానికి అవసరమైన ట్రేస్ మినరల్స్‌తో పాటు కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు ఉంటాయని అధ్యయనంలో పేర్కొంది. ఈ ఖనిజాలు నరాల పనితీరు, కండరాల సంకోచాలు, శరీర ద్రవ సమతుల్యత వంటి ముఖ్యమైన శరీర విధులకు మద్దతు ఇస్తాయంటున్నారు.

**జీర్ణక్రియకు సహాయం :** ఆయుర్వేదం ప్రకారం, రాక్ సాల్ట్ జీర్ణక్రియను మెరుగుపరచడం, కడుపు ఉబ్బరం, అసిడిటీ, మలబద్ధకం వంటి ఉదర సంబంధిత సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడుతుందని అంటున్నారు. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు.

**ఎలక్ట్రోలైట్, హైడ్రేషన్ :** సాధారణ ఉప్పు శరీరాన్ని డీ హైడ్రేట్ చేస్తుందని, అదే పింక్ సాల్ట్ అయితే బాడీని తేమగా ఉంచుతూ ఎలక్ట్రోలైట్ల స్థాయులను బ్యాలెన్స్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పింక్ సాల్ట్ నీటి మిశ్రమాన్ని (సోలో వాటర్) తాగినప్పుడు కండరాల తిమ్మిరి తగ్గుతుందని అధ్యయనంలో పేర్కొంది.

**తక్కువ సోడియం కంటెంట్ :** సాధారణ ఉప్పుతో పోలిస్తే పింక్ సాల్ట్‌లో సోడియం స్థాయిలు తక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. దీని వల్ల వంటలో ఒకే పరిమాణాన్ని కొలిచి వాడినప్పుడు, సాధారణ ఉప్పు కంటే తక్కువ సోడియం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకే, బీపీతో బాధపడుతున్న వారు, తక్కువ సోడియం తీసుకోవాలనుకునే వారికి ఇది మంచిదని సూచిస్తున్నారు.రాక్ సాల్ట్‌లో ఖనిజాలు ఉన్నప్పటికీ, అవి చాలా తక్కువ పరిమాణంలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కేవలం ఉప్పు ద్వారానే ఆ ఖనిజాల అవసరాలను తీర్చుకోవడానికి ప్రయత్నించడం మంచిది కాదని సూచిస్తున్నారు. ముఖ్యంగా రాక్ సాల్ట్‌ను వాడుతున్నట్లయితే, సాధారణ ఉప్పు ద్వారా లభించే అయోడిన్‌ను ఇతర ఆహార వనరుల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పు ఏదైనా సరే, ఆరోగ్యకరమైన జీవితం కోసం మితంగానే వాడటం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. రక్తపోటు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే, ఆహారంలో ఉప్పు మార్పుల గురించి వైద్యుల సలహా తీసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు.

# ఈ ఆకులు చిన్నగా ఉన్నా.. చేసే మేలు ఎంతో తెలుసా.. ఒకసారి మీరు తిని చూడండి..!



మనం తినే ఆహారంలో సరైన మార్పులు చేసుకుంటే ఆరోగ్యం బాగు చేసుకోవడం పెద్ద కష్టం కాదు. అలాంటి మార్గాల్లో మెంతి ఆకులు ఒకటి. ఇవి పూర్తిగా సహజంగా దొరుకుతాయి. మన శరీరానికి కావాల్సిన పోషకాలను ఇవి అందిస్తాయి. అది ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం. మన పెద్దలు.. ముఖ్యంగా పల్లెల్లో ఉండేవాళ్ళు మెంతి ఆకుల గొప్పదనాన్ని చాలా ముందుగానే గుర్తించారు. అయితే ఈ రోజుల్లో నగరాల్లో ఉంటున్న వాళ్ళు ఆరోగ్యకరమైన ఆహారం కావాలని అనుకుంటున్నా.. ఈ చిన్న ఆకుల్లో ఉన్న ఆరోగ్య రహస్యాలను మర్చిపోతున్నారు.మెంతి ఆకులను పరోటాలు, కూరలు, పచ్చడి లాంటి వాటిలో వాడడం ద్వారా మనం వాటిని సులభంగా మన ఆహారంలో చేర్చుకోవచ్చు. ఈ ఆకుల్లో జీర్ణక్రియకు సహాయపడే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఫైబర్, ప్రొటీన్లు ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా జీర్ణక్రియలు సరిగా జరిగేలా చేస్తాయి. మధుమేహం ఉన్నవారికి మెంతి ఆకులు చాలా మంచి చేస్తాయి. వీటిలో ఉండే సహజ పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి షుగర్ స్థాయిలను సమతుల్యం చేస్తాయి. ఇవి శరీరంలోని అనవసరపు కొవ్వును తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడానికి తోడ్పడతాయి. దీని వల్ల గుండె సమస్యల నుంచి దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుంది.మెంతులు ఆడవాళ్లకు ఎంతో మేలు చేస్తాయి. బిడ్డ పుట్టాక తల్లి పాలు ఎక్కువ రావడానికి ఇవి సహాయపడుతాయి. అలాగే అరుగుదల సమస్యలు, మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలను తగ్గించడంలో ఇది సహజమైన మందులా పనిచేస్తుంది. మగవాళ్ళ విషయంలో చూస్తే మెంతులు శరీర శక్తిని పెంచడంలో.. సహజ హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో తోడ్పడతాయి.శరీరం దృఢంగా మారడానికి కూడా ఇవి సహాయపడతాయి. మెంతులు రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకుంటే గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది. సరైన మోతాదులో రోజూ మెంతులను తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యాన్ని పూర్తిగా బాగు చేసుకోవచ్చు. మెంతి ఆకులను వాడడం ద్వారా మనం మన ఆరోగ్య ప్రయాణంలో సహజ మార్గాన్ని ఎంచుకున్నట్లే.

# వామ్మో..ఇంత చేదు మాకొద్దని పారిపోతున్నారా.. కాకరకాయ లాభాలు తెలిస్తే..



కూరగాయలన్నింటిలో కాకరకాయ అంటే చాలా మంది దూరం పెడుతుంటారు. అంత చేదు మాకొద్దు బాబోయ్ అంటూ పారిపోతుంటారు. కానీ, ఇందులోని చేదు ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలిస్తే మాత్రం ఇకపై తినకుండా ఉండలేరు. ఈ చేదు కూరగాయలో అనేక పోషకాలు నిండివున్నాయి. కాకరకాయలోని గుణాలు అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. చేదు కాకరకాయ తినటం వల్ల కలిగే కొన్ని ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.షుగర్ కంట్రోల్ అవ్వాలనుకునే డయాబెటిస్ బాధితులకు కాకరకాయ వరం లాంటిది అంటున్నార ఆరోగ్య నిపుణులు. కాకరకాయలోని గుణాలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాదు..కాకరకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.కాకరకాయ కూరతో పాటుగా జ్యూస్‌లా కూడా తీసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ఇందులో కేలరీలు తక్కువగా ఉండి, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దాంతో కాకరకాయ జ్యూస్ తీసుకోవటం వల్ల త్వరగా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఎక్కువ ఆహారం తీసుకోకుండా చేస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.కాకరకాయలో విటమిన్ సి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడానికి సహాయపడతాయి. అలాగే, కాకరకాయ జ్యూస్‌లోని విటమిన్ ఎ, సి వంటి యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. మొటిమలను తగ్గించడంలో చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. తరచూ కాకరకాయ జ్యూస్ తీసుకోవటం వల్ల కాలేయాన్ని శుభ్రపరచడానికి, కాలేయ పనితీరును మెరుగుప రచడానికి సహాయపడుతుంది. ఇది శరీరంలోని విష వ్యర్థాలను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. కాకరకా యలో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే సమ్మేళనాలు ఉన్నాయి. ఇది ముఖ్యంగా రొమ్ము, ప్రోస్టేట్ పెద్దప్రేగు కాన్సర్ల నివారణలో సహాయపడుతుంది. కాకరకాయలో విటమిన్ ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడానికి కంటి సమస్యలను నివారించడానికి తోడ్పడుతుంది. ఎముకల ఆరోగ్యానికి సహాయపడుతుంది. దంతాలను బలంగా ఉంచుతుంది.

# ‘కాఫీ’ మీ కాలేయానికి బెస్ట్ ఫ్రెండ్! అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే!



కాఫీ-కాలేయ ఆరోగ్యంపై కొన్నేళ్లుగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఉదయపు కాఫీ కేవలం తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, అంతకంటే ఎక్కువే మేలు చేస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. చాలామంది తమ రోజును ప్రారంభించడానికి కాఫీపైనే ఆధారపడతారు. అయితే, కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కూడా ఇది సానుకూల పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో క్రమం తప్పకుండా కాఫీ తాగడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, కొన్ని రకాల కాలేయ వ్యాధుల ముప్పు కూడా తగ్గుతుందని అంటున్నారు.కాఫీ తాగడం వల్ల కలిగే అతి పెద్ద ప్రయోజనాల్లో ఒకటి, ఇది దీర్ఘకాలిక కాలేయ ఆరోగ్యానికి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీన్ని క్రమం తప్పకుండా కాఫీ తాగడం వల్ల ‘లివర్ సిరోసిస్’ వచ్చే ప్రమాదం తగ్గుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.సిరోసిస్ అనేది ఒక తీవ్రమైన కాలేయ వ్యాధి. దీనివల్ల ఆరోగ్యకరమైన కాలేయ కణజాలం క్రమంగా మచ్చల కణజాలంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, శరీరంలోని విషపదార్థాలను వడపోయడం, పోషకాలను ప్రాసెస్ చేయడం వంటి ముఖ్యమైన విధులను కాలేయం సరిగ్గా నిర్వహించలేకపోతుందని అంటున్నారు. సాధారణంగా దీర్ఘకాలికంగా మద్యం సేవించడం, దీర్ఘకాలిక హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లు, ఫ్యాటీ లివర్ వ్యాధి వంటి కారణాల వల్ల సిరోసిస్ సంభవిస్తుంది.అయితే, క్రమం తప్పకుండా కాఫీ తాగే వారికి ఈ సిరోసిస్ వచ్చే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. కాలేయ రక్షణకు అత్యంత ప్రభావవంతంగా పనిచేసే పానీయాలలో కాఫీ ఒకటిగా నిలిచింది.ఉదయం తాగే కాఫీ కాలేయ ఎంజైమ్ మార్కర్లపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. కాలేయ ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి డాక్టర్లు ప్రధానంగా ఈ ఎంజైమ్ స్థాయిలనే పరిశీలిస్తారు.కాలేయం దెబ్బతిన్నప్పుడు లేదా వాపునకు గురైనప్పుడు సాధారణంగా పెరిగే (అస్పర్టేట్ ట్రాన్స్ అమినేస్) అనే రెండు ముఖ్యమైన ఎంజైమ్‌ల స్థాయిలను తగ్గించడంలో క్రమం తప్పకుండా కాఫీ తాగడం సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఎంజైమ్ స్థాయిలు ఆరోగ్యకరమైన పరిమితిలో ఉండటం వల్ల కాలేయం మరింత మెరుగ్గా పనిచేస్తోందని, ఆ అవయవంపై ఒత్తిడి తగ్గుతుందని అంటున్నారు. ఈ క్రమంలో కాఫీ అనేది కాలేయ వ్యాధులకు పూర్తి చికిత్స కానప్పటికీ, ఆరోగ్యకరమైన కాలేయ ఎంజైమ్ స్థాయిలను నిర్వహించడంలో ఇది చూపే సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు.ఫ్యాటీ లివర్ వ్యాధి ఉన్నవారిలో కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి బలమైన వైద్యపరమైన ఆధారాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కాఫీ ఒక్కటే చీూఖీూణని పూర్తిగా నిరోధించలేకపోయినా లేదా నయం చేయలేకపోయినా, దీన్ని క్రమం తప్పకుండా తీసుకునే వారికి ఈ వ్యాధి వల్ల కలిగే తీవ్రమైన కాలేయ నష్టం జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. కాబట్టి, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామంతో పాటు కాఫీని కూడా తమ దినచర్యలో భాగం చేసుకుంటే, కాలేయ ఆరోగ్యం మరింత మెరుగవుతుందని నిపుణులు చెబుతున్నారు.కాఫీ అందించే ప్రయోజనాలు కేవలం కెఫిన్ వల్లనే కాకుండా, దానిలో సహజంగా లభించే పాలిఫెనాల్స్ అనే మొక్కల సమ్మేళనాల వల్ల ఎక్కువగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపుతో పోరాడటానికి సహాయపడతాయంటున్నారు.సాధారణ కాఫీ తాగే వారిలాగే, డీకాఫీన్ చేసిన కాఫీ తాగే వారిలో కూడా కాలేయ ఎంజైమ్ స్థాయిలు మెరుగైనట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. కాబట్టి, కాఫీలో కేవలం కెఫిన్ మాత్రమే కాకుండా ఇతర ప్రయోజనకరమైన పదార్థాలు కూడా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.కాఫీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించి నప్పటికీ, దానిని పరిమితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. చాలామంది ఆరోగ్యవంతులు రోజుకు 3-4 కప్పుల కాఫీని సురక్షితంగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు, గర్భిణులు లేదా కెఫిన్ పడని వారు తమ కాఫీ వినియోగాన్ని పెంచే ముందు ఆరోగ్య నిపుణుల నుంచి వ్యక్తిగత సలహా తీసుకోవాలని అంటున్నారు.

## చాక్లెట్ తినడం వల్ల ఎన్ని లాభాలో తెలిస్తే..

# ఎగిరి గంతేస్తారు..!



అయితే, మనం తినే సాధారణ చాక్లెట్స్ కంటే కూడా డార్క్ చాక్లెట్స్ చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ డార్క్ చాక్లెట్లలో చక్కెర తక్కువగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలు పరిశోధనలు కూడా వెల్లడించాయి. ఎప్పుడూ ఏదో ఒక చిరుతిండి తినాలని ఉన్న ఒక చిన్న చాక్లెట్ నోట్లో వేసుకోండి. ఇక అలాంటి పదార్థాల పైకి మనసు మళ్లదు. తద్వారా అధిక బరువు పెరగకుండా ఉంటారు. చాక్లెట్ అంటే ఇష్టపడని వారుండరు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ చాక్లెట్ తినేందుకు ఇష్టపడతారు. ముఖ్యంగా అమ్మాయిలైతే చెవి కోసుకుంటారు. చాక్లెట్స్‌లో చాలా రకాలు ఉన్నాయి. ఎన్నో బ్రాండ్స్ చాక్లెట్‌లు మార్కెట్లో అమ్ముతుంటారు. అయితే, చాక్లెట్ తినడం వల్ల నోటికి రుచి మాత్రమే కాదు.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిడిని తగ్గించే అద్భుత గుణాలు చాక్లెట్‌లో ఉన్నాయని చెబుతున్నారు. మన మెదడులో సెరటోనిన్ హార్మోన్ స్థాయులను పెంచి ఆందోళనలను తగ్గిస్తుంది. మనసుకు ప్రశాంతాన్నిస్తుంది.

చాక్లెట్‌లో ‘ఎల్-ఆర్జినైన్’ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్స్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. అలాగే చర్మానికి రక్తప్రసరణను మెరుగుపరిచి చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. గర్భిణిగా ఉన్నప్పుడు రోజూ 30 గ్రాముల చాక్లెట్ తీసుకోవడం వల్ల పిండం ఆరోగ్యంగా ఎదుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గర్భిణులు చాక్లెట్ తినాలని నిపుణులు చెబుతున్నారు. అయితే, మనం తినే సాధారణ చాక్లెట్స్ కంటే కూడా డార్క్ చాక్లెట్స్ చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ డార్క్ చాక్లెట్లలో చక్కెర తక్కువగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలు పరిశోధనలు కూడా వెల్లడించాయి. ఎప్పుడూ ఏదో ఒక చిరుతిండి తినాలని ఉన్న ఒక చిన్న చాక్లెట్ నోట్లో వేసుకోండి. ఇక అలాంటి పదార్థాల పైకి మనసు మళ్లదు. తద్వారా అధిక బరువు పెరగకుండా ఉంటారు.

## వామ్మో.. సడెన్‌గా మందులు మానేస్తున్నారా..

# ఎంత డేంజరో తెలుసా..



మారుతున్న జీవనశైలి కారణంగా, అధిక రక్తపోటు గురించి ఫిర్యాదులు ప్రజలలో సర్వసాధారణంగా మారుతున్నాయి. అటువంటి పరిస్థితిలో, వైద్యులు నిరంతరం మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తారు. కానీ చాలా సార్లు ప్రజలు వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం మానేస్తారు.. ఇది చాలా ప్రమాదకరమంటున్నారు వైద్యనిపుణులు.. ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే అధిక రక్తపోటు సమస్య ఇప్పుడు యువకులు, మధ్య వయస్కులలో కూడా కనిపిస్తోంది. అటువంటి పరిస్థితిలో, బిపిని నియంత్రణలో ఉంచడానికి వైద్యులు నిరంతరం మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఈ మందులను నిరంతరం తీసుకోవడం చాలా ముఖ్యం. కానీ చాలా సార్లు రోగులు వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం మానేస్తారు.. ఇది అనేక సమస్యలకు దారితీస్తుంది. అటువంటి పరిస్థితిలో, గుండె, మెదడు, మూత్రపిండాలు, కళ్ళు తీవ్రంగా ప్రభావితమవుతాయి. దీని వల్ల ఎలాంటి నష్టం జరుగుతుంది.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను ఈ కథనంలో తెలుసుకోండి.. అధిక రక్తపోటు కారణంగా, రక్త నాళాలలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, మీరు అధిక రక్తపోటుకు మందు తీసుకోవడం ఆపివేస్తే, అది గుండె, మెదడు, మూత్రపిండాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది.. నిరంతర అధిక రక్తపోటు కారణంగా అవి దెబ్బతింటాయి. ఇది జీవితాంతం సమస్యలకు కారణం కావచ్చు. అకస్మాత్తుగా మందులు ఆపివేసిన తర్వాత, రోగికి తలనొప్పి, తలతిరగడం, భయము, ఛాతీ నొప్పి, వేగవంతమైన హృదయ స్పందన, కాళ్ళలో వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండవచ్చు.. ఇలాంటి పరిస్థితుల్లో పరిస్థితి మరింత దిగజారిపోయే అవకాశం ఉంది. రోగిని వెంటనే ఆసుపత్రిలో చేర్చాల్సి రావచ్చు..

### మెదడు రక్తస్రావం లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం

ఢిల్లీలోని ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి మాట్లాడుతూ.. అధిక రక్తపోటు మందులను ఆపడం ద్వారా మెదడు రక్తస్రావం లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. కొన్నిసార్లు రోగి అకస్మాత్తుగా మూర్ఛపోవడం, శరీరంలోని ఏదో ఒక భాగంలో బలహీనత లేదా మాట్లాడటంలో ఇబ్బంది గురించి ఫిర్యాదు చేయడం ప్రారంభిస్తాడు. అధిక రక్తపోటు మందులను అకస్మాత్తుగా ఆపడం వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతుంది.. ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. కిడ్నీ వైఫల్యం కూడా సంభవించవచ్చు. అకస్మాత్తుగా మందులను ఆపడం వల్ల రక్తపోటును నియంత్రించడం కష్టమవుతుంది.. మందుల ప్రభావం కూడా తగ్గుతుంది.

### ప్రజలు మందులను ఎందుకు మానేస్తారు..

చాలా సార్లు రోగులు తమ రక్తపోటు ఇప్పుడు సాధారణమైందని భావిస్తారని, కాబట్టి వారికి మందులు అవసరం లేదని సొంతంగా నిర్ణయం తీసుకుంటారని డాక్టర్ సుభాష్ వివరించారు. కొంతమంది మందుల దుష్ప్రభావాలకు భయపడి మందులు తీసుకోవడం మానేస్తారు. కొంతమంది మతిమరుపు లేదా నిర్లక్ష్యం కారణంగా అధిక బిపి మందులు తీసుకోవడం మానేస్తారు. కొన్ని సందర్భాల్లో, ప్రజలు ఇంటి లేదా ఇతర పద్ధతులపై ఆధారపడటం ద్వారా మందులు తీసుకోవడం మానేస్తారు. చాలా సార్లు ప్రజలు సోషల్ మీడియా లేదా వారి పరిచయస్తుల నుండి సమాచారాన్ని సేకరించడం ద్వారా మందులను ఆపాలని లేదా మోతాదును తగ్గించాలని నిర్ణయించుకుంటారని.. పేర్కొన్నారు.

### వైద్యుడిని సంప్రదించండి

అధిక రక్తపోటు ఉన్న రోగులు ఎప్పుడూ స్వయంగా మందులు తీసుకోవడం ఆపకూడదు. మందులు ఆపాలనే నిర్ణయం ఎల్లప్పుడూ వైద్యుడి సలహా మేరకే తీసుకోవాలి. మందుల దుష్ప్రభావాల గురించి వైద్యుడితో మాట్లాడండి. ఏదైనా ఔషధం దుష్ప్రభావాలను కలిగి ఉంటే, ఆ మందును తీసుకోవడం ఆపండి లేదా వైద్యుడి సలహా మేరకే మోతాదును తగ్గించండి. బరువు తగ్గడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, యోగా చేయడం, ఆహారపు అలవాట్లను నియంత్రించడం వంటి మార్పులు ఉంటే, మందులను ఆపవచ్చు లేదా తగ్గించవచ్చు.. కానీ ఈ పనులు కూడా వైద్యుడి పర్యవేక్షణలో చేయాలి.. కావున.. సైలెంట్ కిల్లర్ హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు) గురించి బాధపడుతుంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించండి..

# ఆకులతో ఆరోగ్యం!



ఆయుర్వేదంలో ‘నేరేడు’ది ప్రత్యేక స్థానం. దీని పండ్లు మాత్రమే కాదు.. ఆకులు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అనేక ఔషధ గుణాలతో నిండిన నేరేడు ఆకులు.. వివిధ వ్యాధులను నివారించడంలో సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు. నేరేడు ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా మారుతాయి. వీటిలోని ఆయుర్వేద సమ్మేళనాలు.. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. నేరేడు ఆకుల కషాయం తాగితే.. విరేచనాలు ఇట్టే తగ్గిపోతాయి. కాలేయం పనితీరు కూడా మెరుగుపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలూ తగ్గిపోతాయి. నేరేడు ఆకుల్లో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలం. ఇవి రక్తంలో చక్కెర విడుదలను నియంత్రిస్తాయి. దాంతో, షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అలా.. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుతాయి. భోజనానికి ముందు.. ఓ టీస్పూన్ నేరేడు ఆకుల రసాన్ని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నేరేడు ఆకుల రసంలో కొద్దిగా ధనియాలు వేసి తాగితే.. జ్వరం తగ్గిపోతుంది.

# ఉద్యోగులకు షాకిచ్చిన జొమాటో.. 250 మంది ఉద్యోగులు తొలగింపు..




ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో తన కస్టమర్ సపోర్ట్ సెంటర్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. మూసివేతలో భాగంగా హైదరాబాద్ ఆఫీసులో పనిచేస్తున్న సుమారు 250 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. కేవలం ఖర్చులు తగ్గించుకోవడం కోసమే కాకుండా.. పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ లేఆఫ్స్ చేపట్టినట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో సెంటర్‌ను మూసివేస్తున్నప్పటికీ.. జొమాటో తన ఇన్-హౌస్ కస్టమర్ సపోర్ట్ ఆపరేషన్స్‌ను పూర్తిగా ఆపలేదని జొమాటో ప్రకటించింది. వీటిని హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న తన హెడ్ ఆఫీసుకు మారుస్తున్నట్లు ప్రకటించింది.ప్రొడక్ట్, టెక్నాలజీ, అనలిటిక్స్ వంటి కీలక విభాగాలకు కస్టమర్ సపోర్ట్ టీమ్ లను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జొమాటో కంపెనీ ప్రకటించింది. గత 6 నెలలుగా కస్టమర్ కేర్ బాధ్యతలను బయటి సంస్థలకు అవుట్‌సోర్సింగ్ చేయడం కూడా క్రమంగా పెరుగుతోన్న నేపథ్యంలో ఫుడ్ డెలవరీ కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయంతో ఉద్యోగం కోల్పోతున్న సిబ్బందికి జొమాటో తగిన భద్రత కల్పిస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగులకు ఆగస్ట్ నెల పూర్తి జీతంతో పాటు.. కాంట్రాక్ట్ నోటీస్ పే, ఒకేసారి చెల్లించే ఎక్స్-గ్రేషియా కలిపి మొత్తం 4 నెలల వేతనాన్ని సెవెరెన్స్ ప్యాకేజీ కింద చెల్లిస్తున్నట్లు సమాచారం. సంచలన నిర్ణయం.. ఇక ఈ ఫుడ్ ఐటమ్స్ మీకు ఇక కనిపించవు.. 250 మంది ఉద్యోగులు ఔట్.. అంతేకాకుండా ఉద్యోగం నుంచి రిలీజైన తర్వాత కూడా మార్చి 31, 2027 వరకు మెడికల్ ఇన్సూరెన్స్, కౌన్సెలింగ్ సపోర్ట్ కొనసాగించుకునే వెసులుబాటు జొమాటో కల్పించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కంపెనీలు కస్టమర్ సపోర్ట్ కోసం భారీ ఇన్-హౌస్ టీమ్‌లను ఉంచుకోవడానికి బదులుగా ఏఐ, ఆటోమేషన్, థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లపై ఎక్కువగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. ఇదే ట్రెండ్ కొనసాగుతుండటంతో కస్టమర్ కేర్ ఉద్యోగులపై వేటు పడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ 2025లోనూ జొమాటో సుమారు 500 మంది జూనియర్ స్థాయి ఉద్యోగులను తొలగించింది. ఈసారి హైదరాబాద్ సెంటర్ మూసివేతతో మరోసారి పెద్ద ఎత్తున లేఆఫ్స్ కు తెర లేపింది. ఈ లే ఆఫ్స్ తో దాదాపు 250 మంది ఉపాధి కోల్పోనున్నట్లు తెలుస్తోంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# సెప్టెంబర్‌లో బ్యాంకులు 14 రోజులు బంద్.. రాష్ట్రాల వారీగా పూర్తి హాలిడే లిస్ట్ ఇదే..




సెప్టెంబర్ నెలలో అనేక జాతీయ, ప్రాంతీయ పండుగలు రానుండటంతో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బ్యాంకులకు పలు రోజులు సెలవులు ఉండనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సెలవుల క్యాలెండర్ ప్రకారం.. వివిధ నగరాలు, రాష్ట్రాలను బట్టి ఈ మూసివేత దినాలు వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల బ్యాంకింగ్ పనుల కోసం వెళ్లే వినియోగదారులు తమ స్థానిక శాఖల సెలవు వివరాలను ముందే సరిచూసుకోవడం అవసరం. ఒక ప్రాంతంలో బ్యాంకులు మూసివేసి ఉన్నంత మాత్రాన దేశవ్యాప్తంగా సేవలు నిలిచిపోవని, అలాగే సాధారణ సెలవులైన అన్ని ఆదివారాలు, నెలలోని రెండవ, నాల్గవ శనివారాల్లో కూడా బ్యాంకులు పనిచేయవని స్పష్టం చేశారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రతినెలలో వచ్చే అన్ని ఆదివారాలు, అలాగే రెండవ, నాల్గవ శనివారాలు బ్యాంకులకు సాధారణ వారాంతపు సెలవు దినాలుగా వర్తిస్తాయి. ఈ క్రమంలో రాబోయే సెప్టెంబర్ నెలలో నాలుగు ఆదివారాలు మరియు రెండు శనివారాలు కలుపుకొని మొత్తం 6 రోజులు వారాంతపు సెలవులుగా రానున్నాయి. వీటితో పాటు వివిధ జాతీయ, ప్రాంతీయ పండుగ సెలవులు తోడవడంతో సెప్టెంబర్ నెలలో మొత్తం బ్యాంకు సెలవుల సంఖ్య 14 రోజులకు చేరింది. ~శ్రీంశీ =ము౹ మార్కెట్ సెలవు రోజున మీ డబ్బులు కట్ అయ్యాయా? ఆందోళన వద్దు, అసలు విషయం ఇదే సెప్టెంబర్ నెల వారాంతపు సెలవుల వివరాలు: సెప్టెంబర్ 6 మొదటి ఆదివారం సెప్టెంబర్ 12: రెండవ శనివారం సెప్టెంబర్ 13 రెండవ ఆదివారం సెప్టెంబర్ 20: మూడవ ఆదివారం సెప్టెంబర్ 26 నాల్గవ శనివారం సెప్టెంబర్ 27: నాల్గవ ఆదివారం సెప్టెంబర్ నెల బ్యాంకు సెలవుల వివరాలు: సెప్టెంబర్ 4 (జన్మాష్టమి) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, గుజరాత్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మూసివేత. సెప్టెంబర్ 11: జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కారణంగా రాజస్థాన్‌లో బ్యాంకులకు సెలవు. సెప్టెంబర్ 12 శ్రీమంత శంకరదేవుని తిరుభావ తిథి సందర్భంగా అస్సాంలో మూసివేత. సెప్టెంబర్ 14 (వినాయక చతుర్థి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, ఒడిశా, గోవాలలో బ్యాంకులు మూసివేయబడతాయి. సెప్టెంబర్ 15 సంవత్సరి, నువాఖై, గణేష్ చతుర్థి రెండవ రోజు సందర్భంగా గుజరాత్, ఒడిశా, గోవాలలో సెలవు. సెప్టెంబర్ 21 శ్రీమంత శంకరదేవ్ జయంతి, శ్రీ నారాయణ గురు సమాధి దినోత్సవం సందర్భంగా అస్సాం, కేరళలలో మూసివేత. సెప్టెంబర్ 22 (కర్మ పూజ) జార్ఖండ్‌లో బ్యాంకు శాఖలకు సెలవు. సెప్టెంబర్ 23 మహారాజా హరి సింగ్ జీ జన్మదినోత్సవం సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లో బ్యాంకులు మూసివేత. సెప్టెంబర్ 25 (ఇంద్రజాతర) సిక్కింలో బ్యాంకులకు సెలవు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోనే... బ్యాంకు శాఖలు మూసివేసినప్పటికీ, వినియోగదారులకు సాంప్రదాయ బ్యాంకింగ్ సేవలకు ఇబ్బంది కలగకుండా డిజిటల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటుంది. ఏటీఎం , యూపీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు యథావిధిగా పనిచేస్తాయి. బ్యాంకులు నిర్వహించే ముందస్తు సాంకేతిక లేదా సిస్టమ్ అప్‌డేషన్ సమయంలో మాత్రమే ఈ సేవలకు స్వల్ప అంతరాయం కలగవచ్చు. దరఖాస్తులు సమర్పించడం, ఖాతాల ధృవీకరణ, నగదు లేదా డాక్యుమెంట్ల ప్రత్యక్ష సమర్పణ వంటి నేరుగా బ్యాంకర్ సహాయం కావలసిన పనులు సెలవు రోజుల్లో సాధ్యపడవు.

# మెస్సీ శకం ముగిసింది.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్



ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

### భావోద్వేగ లేఖలో మెస్సీ ఏమన్నాడంటే

"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు.తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే.కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు.రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. "ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను" అని పేర్కొన్నాడు.జట్టు సభ్యులతో కలిసి దేశం కోసం సాధించిన విజయాలపై గర్వంగా, సంతృప్తిగా ఉన్నానని మెస్సీ తెలిపాడు. "నా సహచరులతో కలిసి, మనం కలలు మాత్రమే కనగలిగే క్షణాలను మీకు అందించామన్న గర్వంతో, మనశ్శాంతితో నేను వెళ్ళిపోతున్నాను. మీతో కలిసి ఆ అనుభూతిని పొందడం ఒక అద్భుతం. ఐ లవ్ యూ నన్ను అర్జెంటీనా వాడిగా పుట్టించినందుకు దేవుడికి ధన్యవాదాలు. లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన లేఖను ముగించాడు. 2005లో అర్జెంటీనా సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసిన మెస్సీ, 207 మ్యాచ్‌లతో దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 125 గోల్స్ సాధించాడు. తన కెరీర్‌లో 2022లో ప్రపంచకప్ విజయం, రెండు కోపా అమెరికా టైటిళ్లు వంటి శిఖరాలను అధిరోహించడంతో పాటు, 2014, 2026 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఓటముల వంటి బాధాకరమైన క్షణాలను కూడా చవిచూశాడు. అతడి అంతర్జాతీయ కెరీర్ ముగిసినప్పటికీ, క్లబ్ ఫుట్‌బాల్‌లో మాత్రం కొనసాగనున్నారు. 2028 వరకు కాంట్రాక్ట్ ఉన్న ఇంటర్ మయామి జట్టు తరఫున ఆయన ఆడటం కొనసాగిస్తాడు. మెస్సీ వీడ్కోలుతో అర్జెంటీనా ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది.

# జొమాటో సంచలన నిర్ణయం.. ఇక ఈ ఫుడ్ ఐటమ్స్ మీకు ఇక కనిపించవు.. 250 మంది ఉద్యోగులు ఔట్..




ప్రముఖ ఫుడ్ డెలివరీ దిగ్గజం 'జొమాటో' తమ ప్లాట్‌ఫామ్‌లో ఆహార నాణ్యతను పెంచేందుకు, వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. తమ యాప్‌లో అనలాగ్ పాల ఉత్పత్తులతో (కల్తీ లేదా కృత్రిమ పాల మిశ్రమాలు) తయారు చేసే వంటకాలను విక్రయించడాన్ని తక్షణమే నిషేధిస్తున్నట్లు సంస్థ అధికారిక పత్రికా ప్రకటనలో వెల్లడించింది.అనలాగ్ ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు ప్రకటించిన రెస్టారెంట్ భాగస్వాముల వంటకాలను ప్లాట్‌ఫామ్ నుండి ఇప్పటికే తొలగించినట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదని, నిబంధనలను ఉల్లంఘించే రెస్టారెంట్ల లిస్టింగ్‌లను తొలగించే పూర్తి హక్కు తమకు ఉందని హెచ్చరించింది. వినియోగదారులకు మెరుగైన, స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడమే తమ ప్రధాన ధ్యేయమని, పారదర్శకత మరియు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నామని జొమాటో సీఈఓ ఆదిత్య మంగ్లా తెలిపారు. రెస్టారెంట్ భాగస్వాములకు జొమాటో మార్గదర్శకాలు ఆహార నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని కోరుతూ తమ రెస్టారెంట్ భాగస్వాములకు జొమాటో ఈ క్రింది సూచనలు చేసింది సహజ ఉత్పత్తుల వినియోగం అనలాగ్ పదార్థాలకు స్వస్తి చెప్పి వెంటనే సహజమైన పాల ఉత్పత్తులకు మారాలి. మెనూ నుండి తొలగింపు: ఒకవేళ తక్షణ మార్పు సాధ్యం కాకపోతే, అనలాగ్ పాల ఉత్పత్తులు కలిగిన వంటకాలను మెనూ జాబితా నుండి వెంటనే తొలగించాలి. ప్రామాణిక తనిఖీ సరఫరాదారులు అందించే ఉత్పత్తి లేబుళ్లు మరియు పదార్థాల వివరాలను సమగ్రంగా సమీక్షించి, జొమాటోలో సరైన సమాచారాన్ని మాత్రమే పొందుపరచాలి. నిబంధనలను పాటించని రెస్టారెంట్లను తమ ప్లాట్ ఫామ్ నుండి శాశ్వతంగా తొలగిస్తామని కంపెనీ స్పష్టం చేసింది. రూ. 92 కోట్లకు చేరిన జొమాటో లాభం.. ఇప్పుడు స్టాక్ కొనచ్చా హైదరాబాద్‌లో కస్టమర్ సపోర్ట్ యూనిట్ మూసివేత 250 మంది ఉద్యోగాలు ఖాళీ మరో కీలక పరిణామంలో.. జొమాటో తమ కస్టమర్ కేర్ విభాగానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని తన కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాలను జొమాటో పూర్తిగా మూసివేసినట్లు సమాచారం. ఎకనామిక్ టైమ్స్ కథనం ప్రకారం.. హైదరాబాద్ యూనిట్ మూసివేత కారణంగా దాదాపు 250 మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. గత ఆరు నెలలుగా జొమాటో తమ కస్టమర్ సపోర్ట్ సేవలను బాహ్య భాగస్వాములకు అప్పగించే వ్యూహాత్మక మార్పులు చేస్తోందని, అందులో భాగంగానే ఈ లేఆఫ్స్ చోటుచేసుకున్నాయని నివేదిక పేర్కొంది.

# తిలక్ వర్మ అజేయ సెంచరీ.. పటిష్ఠ స్థితిలో సౌత్ జోన్

**దులీప్ ట్రోఫీ సెమీస్‌లో అజేయ శతకంతో మెరిసిన తిలక్ వర్మ**

**శ్రేయస్ గోపాల్ (88)తో కలిసి కీలక భాగస్వామ్యం నమోదు**

**నార్త్ జోన్‌పై 90 పరుగుల ఆధిక్యం సాధించిన సౌత్ జోన్**

**ఒక దశలో 80/5తో కష్టాల్లో పడిన సౌత్ జట్టును ఆదుకున్న తిలక్**

**రెండో రోజు ఆట ముగిసేసరికి 9 వికెట్లకు 285 పరుగులు చేసిన సౌత్ జోన్**



దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో నార్త్ జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అతనికి శ్రేయస్ గోపాల్ (88) కీలక ఇన్నింగ్స్‌తో తోడవడంతో సౌత్ జోన్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. బెంగళూరులోని బీసీసీఏ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో, రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. దీంతో నార్త్ జోన్‌పై 90 పరుగుల కీలక ఆధిక్యాన్ని సంపాదించింది.నార్త్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే కట్టడి చేసిన అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు రికీ భుయ్ (5), షేక్ రషీద్ (0) విఫలమవడంతో పాటు, మిడిలార్డర్ కూడా చేతులెత్తేసింది. దీంతో సౌత్ జోన్ ఒక దశలో 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. గుర్నూర్ బ్రార్ తన పదునైన బౌలింగ్‌తో సౌత్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, శ్రేయస్ గోపాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నార్త్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఆరో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో శతకానికి చేరువైన శ్రేయస్ గోపాల్ 88 పరుగుల వద్ద అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత సౌత్ జోన్ మళ్లీ వికెట్లు కోల్పోయింది. అయితే, ఒక ఎండ్‌లో పాతుకుపోయిన తిలక్ వర్మ తన ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 8వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆట ముగిసే సమయానికి 225 బంతుల్లో 106 పరుగులతో అజేయంగా నిలిచాడు.అంతకుముందు, సౌత్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప 4 వికెట్లతో నార్త్ జోన్ పతనాన్ని శాసించగా, నిధీష్, తనయ్ త్యాగరాజన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 4 వికెట్లు తీశాడు. ప్రస్తుతం క్రీజులో తిలక్ వర్మ, కావూరి సాయితేజ ఉన్నారు.

# మహిళల టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర.. ప్రపంచంలోనే టాప్ వికెట్ టేకర్‌గా దీప్తి శర్మ

**మహిళల టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా దీప్తి శర్మ రికార్డ్**

**ఒక్క పరుగూ ఇవ్వకుండా మూడు వికెట్లు పడగొట్టి అరుదైన ఘనత**

**థాయ్‌లాండ్ బౌలర్ తిపాచా పుత్తావోంగ్‌ను అధిగమించి అగ్రస్థానం**

**150వ టీ20 మ్యాచ్ ఆడిన మూడో భారత మహిళా క్రికెటర్‌గా గుర్తింపు**



భారత మహిళా క్రికెట్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకుంది. దుబాయ్‌లో జరుగుతున్న మహిళల ఆసియా కప్‌లో భాగంగా నిన్న థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆమె ఈ అరుదైన మైలురాయిని అందుకున్నారు. ఈ మ్యాచ్‌లో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మూడు వికెట్లు పడగొట్టి తన అద్భుత ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.ఈ మ్యాచ్‌కు ముందు 168 వికెట్లతో ఉన్న దీప్తి, థాయ్‌లాండ్ బౌలర్ తిపాచా పుత్తావోంగ్ (170 వికెట్లు) రికార్డును బద్దలు కొట్టేందుకు మూడు వికెట్ల దూరంలో నిలిచింది. భారత ఇన్నింగ్స్ అనంతరం 170 వికెట్లతో పుత్తావోంగ్ మ్యాచ్‌ను ముగించడంతో, దీప్తికి రికార్డు అధిగమించే అవకాశం లభించింది. తన స్పెల్‌లో తొమ్మిదో ఓవర్లో రెండు వికెట్లు తీసి పుత్తావోంగ్ రికార్డును సమం చేసింది. ఆ తర్వాత తన తర్వాతి ఓవర్ తొలి బంతికే నన్నపట్ కొంచరోయెంకాయ్‌ను ఔట్ చేసి, 171వ వికెట్‌తో ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది.ఈ మ్యాచ్‌లో దీప్తి శర్మ కేవలం 1.1 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు తీయడం మరో విశేషం. ఫలితంగా మహిళల టీ20ల్లో పరుగులేమీ ఇవ్వకుండా మూడు వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా మరో ఘనతను సాధించింది. ఆమె దెబ్బకు థాయ్‌లాండ్ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ 94 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి, టోర్నీలో శుభారంభం చేసింది.ఈ మ్యాచ్ దీప్తి శర్మ కెరీర్‌లో 150వ టీ20 కావడం గమనార్హం. ఈ మైలురాయిని అందుకున్న మూడో భారత మహిళా క్రికెటర్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన సరసన ఆమె నిలిచింది. ప్రస్తుతం 171 వికెట్లతో దీప్తి అగ్రస్థానంలో ఉండగా, ఆమె తర్వాత పుత్తావోంగ్ (170), రువాండాకు చెందిన హెన్రియెట్ ఇషిమ్వే (164), ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్సెల్‌స్టోన్ (154) వరుస స్థానాల్లో ఉన్నారు.

# మహిళల ఆసియా కప్ థాయ్‌లాండ్‌ను చిత్తుచేసిన భారత్

**మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్‌కు ఘనమైన ఆరంభం**

**తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 94 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీమిండియా**

**కేవలం 36 బంతుల్లో 64 పరుగులు చేసిన షఫాలీ వర్మ**

**మూడేసి వికెట్లతో రాణించిన నందని శర్మ, దీప్తి శర్మ**

**160 పరుగుల లక్ష్య ఛేదనలో 65 పరుగులకే కుప్పకూలిన థాయ్‌లాండ్**



మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల భారీ తేడాతో విజయం నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోరులో ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపు అర్ధశతకంతో సత్తా చాటగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు.ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 36 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీక రావల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు చేసి రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3 వికెట్లు పడగొట్టగా, సునిద 2 వికెట్లు తీసింది.అనంతరం 160 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఆ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. థాయ్‌లాండ్ బ్యాటర్లలో కొంచరోయెంకాయ్ (41) మాత్రమే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారెవరూ కనీస పోరాట పటిమ కనబరచలేకపోయారు. భారత బౌలర్లలో నందని శర్మ, దీప్తి శర్మ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. శ్రీ చరణి రెండు వికెట్లు, క్రాంతి గౌడ్ ఒక వికెట్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

# బాలయ్య కొత్త సినిమాకు రెండక్షరాల టైటిల్ ఫిక్స్ సెప్టెంబర్ 6న భారీ ప్రకటన



నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన ఈ కాంబినేషన్ మరోసారి చేతులు కలపడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మొదటి నుంచే ఉంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లిమ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. తాజాగా ఈ మూవీకి సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా అధికారిక టైటిల్‌తో పాటు థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను సెప్టెంబర్ 6న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో నందమూరి అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. కోసం ఇప్పటికే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. (దాదా) అనే టైటిల్స్‌లో ఒకదాన్ని సినిమాకు ఖరారు చేసే అవకాశం ఉందని టాక్ వచ్చింది. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్ ఎలిమెంట్స్‌కు ఈ రెండు టైటిల్స్ బాగా సెట్ అవుతాయని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం 'దాదా' టైటిల్‌నే దాదాపుగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక క్లారిటీ మాత్రం సెప్టెంబర్ 6న రానుంది. ఆ రోజే టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. గోపీచంద్ మలినేని ఈసారి బాలయ్యను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.




## శ్రీవిష్ణు నుంచి మరో కొత్త సినిమా.. కామెడీకి దూరంగా ఎమోషనల్ కథతో వస్తున్న యంగ్ హీరో!

వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు.. ఈసారి మాత్రం సరికొత్త ఎమోషనల్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హారికా హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ గ్లింప్స్ విడుదల చేశారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనే ఓ సాధారణ మధ్యతరగతి అబ్బాయి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతల కారణంగా తన ఆశలను పక్కన పెట్టి సాధారణ జీవితాన్ని కొనసాగించే పరిస్థితిని ఇందులో చూపించినట్లు తెలుస్తోంది. మంచి కాలేజీలో చదవాలనే కోరిక ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా సాధారణ కాలేజీలో చదవడం.. జీవితంలో ఎన్నో సాధించాలని ఆశించినా కుటుంబ బాధ్యతల కోసం ఉద్యోగం చేయడం.. ఇలా ఎంతోమంది మిడిల్ క్లాస్ యువకుల జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. శ్రీవిష్ణు సినిమాలంటే సాధారణంగా కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు డిఫరెంట్ కాన్సెప్ట్‌లు గుర్తుకొస్తాయి.



# 'వేట' ఓ గ్రామీణ కథ

అశోక్ కోటిపల్లి దర్శకత్వంలో సందీప్ సరోజ్, సాత్విక జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'వేట'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమం? సోమవారం(ఆగస్టు 31) ఘనంగా నిర్వహించారు. కొణిదెల నాగబాబు, కేఎస్ రవి కుమార్, వీఎన్ ఆదిత్య, మెహర్ రమేష్, సాయి రాజేష్, ఎస్‌కేఎన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సందీప్ మాట్లాడుతూ.. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో అందరికీ పరిచయం అయ్యాను. ఈ కొత్త సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన నాగబాబుకి ధన్యవాదాలు. 'వేట' అనేది చిరంజీవి సినిమా టైటిల్. ఇది ఓ గ్రామీణ కథ. ఈ సినిమాని అందరూ సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. కాగా ఎస్ఆర్‌డీ ప్రొడక్షన్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ సంగీతం అందిస్తున్నారు.




## పిల్లితో మొదలైన మిస్టరీ.. 'హతః' టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి పెంచిన కిరణ్ అబ్బవరం!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. "×ంర్ ష్ట్రవ ఝ్ ఖశ్రీఅజవ శీతీ.." అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది.

## ఒక్క కథ కూడా ఎక్జయిటింగ్‌గా అనిపించలేదు.. రోమాంచకం బ్యూటీ అనంతిక సనిల్ కుమార్

టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో వస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ రోమాంచకం. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో అనంతిక సనిల్ కుమార్, సుమంత్ ప్రభాస్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ గురువారం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా అనంతిక సనిల్ కుమార్ ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది.

రోమాంచకం సినిమా గురించి మాట్లాడుతూ.. 8 వసంతాలు తర్వాత నేను చాలా కథలు విన్నా. కానీ వాటిలో ఏవీ కూడా ఎక్జయిటింగ్‌గా అనిపించలేదు. అప్పుడే రోమాంచకం స్టోరీ నా దగ్గరకు వచ్చింది. ఇలాంటి స్క్రిప్ట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నా. ఈ సినిమాలో సాదాసీదాగా కనిపించే అమ్మాయిగా నటించా. యూత్‌కు రోమాంచకం కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో ప్రేమతోపాటు కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయంది. నేటి యువత జీవితాల్లో చోటుచేసుకుంటున్న సమకాలీన అంశాలను రోమాంచకరం ప్రతిబింబిస్తుంది. మా సినిమాను ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా వీక్షించవచ్చు. నాతో పోలిస్తే సుమంత్ ప్రభాస్ ఈ మూవీ కోసం చాలా వర్క్ షాప్స్‌లో పాల్గొన్నారు. ఆయన పాత్ర ఎంతో ఉత్సాహభరితంగా ఉంటుంది. మా మధ్య డైలాగ్స్ చాలా సహజంగా ఎక్కడా సాగదీసినట్టుగా అనిపించకుండా సాగుతాయని చెప్పుకొచ్చింది.



I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at printed at Global printers #10 MIE Industrial Estate,Kallur,kurnool,Andhrapradesh.
Published from Hno: 4-86-1 New postal Colony,Balaji nagar,Kurnool,Andhrapradesh- 518003.EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ram-jal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com